# వెలుతురు

VELTHURU TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
సోమవారం 11.05.2026

సంపుటి: 07 సంచిక: 338
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper




## పీఎంఓలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

- దేశంలోని ఆరు మహానగరాల ప్రాజెక్టులకు వేగవంతమైన అనుమతులు అవసరం
- ప్రధాని మోడీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రతిపాదన
- హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కోరిన సీఎం
- మెట్రో నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్లు అన్న రేవంత్

2

# తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

ప్రధాని మోదీ



### రూ.9,377 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ

- హైదరాబాద్‌లో వర్చువల్‌గా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శ్రీకారం
- వరంగల్‌లో పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్కుతో భారీ ఉద్యోగావకాశాలు

హైదరాబాద్ వెలుతురు మే 10:

తెలంగాణ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా సైబరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో రాష్ట్రం వేగంగా పురోగమిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా రూ.9,377 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, మౌలిక వసతుల విస్తరణపై ఆయన విశేషంగా మాట్లాడారు. దేశాన్ని 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంతో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ప్రధాని తెలిపారు. ఇందులో తెలంగాణ వంటి రాష్ట్రాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామికీకరణ, రహదారులు, రైల్వేలు, టెక్స్‌టైల్, ఇంధన రంగాల్లో కేంద్రం భారీ పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు.

..మిగతా2లో

- జాతీయ రహదారి 167 విస్తరణతో రవాణాకు కొత్త ఊపు
- కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ప్రారంభం
- హైదరాబాద్ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ పీవీఎల్ ప్రాజెక్టు అందుబాటులోకి
- విద్యుత్, ఈవీ, సైబర్ టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ వేగంగా ఎదుగుతోందన్న మోదీ
- తెలంగాణకు కేంద్రం లక్షల కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి చేస్తోందని వెల్లడి
- అభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణకు కొత్త దశ ప్రారంభమన్న ప్రధాని

## తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- ప్రధాని మోదీకి టీపీసీసీ బహిరంగ లేఖ
- మెట్రో నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు కీలక ప్రాజెక్టులపై ఆమోదం తెలపాలని విజ్ఞప్తి
- ప్రధాని మోదీకి టీపీసీసీ అధ్యక్షుడి బహిరంగ లేఖ
- మెట్రో ఫేజ్–2కు వెంటనే కేంద్ర ఆమోదం ఇవ్వాలని డిమాండ్
- రూ.38,595 కోట్ల మెట్రో విస్తరణకు జాయింట్ వెంచర్ ప్రతిపాదన
- మూసీ పునరుజ్జీవనానికి జాతీయ ప్రాజెక్టు హోదా కోరింపు

2



## బెంగాల్ గెలిచాం.. ఇక లక్ష్యం తెలంగాణ

- అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు తిరస్కరించారని ప్రధాని వ్యాఖ్యలు
- పశ్చిమబెంగాల్‌లో భాజపా చరిత్రాత్మక విజయం సాధించిందన్న ప్రధాని
- అక్కడ ప్రజలు రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించారని వ్యాఖ్య
- తెలంగాణలోనూ అలాంటి మార్పు రావాలని ప్రజలకు పిలుపు
- బెంగాల్ ఫలితాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగిందన్న మోదీ
- ఒకప్పుడు ముగ్గురు ఎమ్మెల్యేలే ఉన్న చోట ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశామని వెల్లడి

2





## ప్రధాని మోదీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ,మంత్రులు పొన్నం ప్రభాకర్,అజారుద్దీన్ ల స్వాగతం

హైదరాబాద్ వెలుతురు మే 10:

తెలంగాణ పర్యటనకు విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం లభించింది. ఆదివారం మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ లు అధికారికంగా స్వాగతం పలికారు.

## వికసిత్ భారత్‌తో తెలంగాణ రైజింగ్ అనుసంధానం చేయండి

### ప్రధాని మోదీని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

- అభివృద్ధి ఉత్సవమే ఈ కార్యక్రమమని రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- జాతీయ భద్రత, అభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యం అని స్పష్టం
- వికసిత్ భారత్ 2047తో తెలంగాణ రైజింగ్ అనుసంధానం
- 2034లో 1 ట్రిలియన్ లక్ష్యంగా తెలంగాణ ప్రణాళిక
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- గుజరాత్ మోడల్ ప్రస్తావనతో కేంద్ర సహకారం కోరిన సీఎం




2

## విజయ్ దా సీఎం..

- తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం
- తొలిరోజే మూడు సంచలన నిర్ణయాలు
- చెన్నై నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా వేడుక
- దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెర
- 'ఉచిత విద్యుత్' పథకానికి అధికారికంగా ఆమోదం
- మహిళల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం
- డ్రగ్స్ అంతం చేసేందుకు ఈగల్ తరహా ప్రత్యేక బృందాలు

చెన్నై వెలుతురు మే 10:

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ అధినేత జోసెఫ్ విజయ్ ఆదివారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం

..మిగతా2లో



## ఏపీలో ఏఐ వైద్య విప్లవం

- 'సంజీవని'తో ఇంటి వద్దకే డిజిటల్ ఆరోగ్య సేవలు
- ఏఐ సాయంతో రోగుల ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ
- కుప్పం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- రాష్ట్రంలోని 5.20 కోట్ల మంది జనాభాకు ప్రయోజనం




2

## భారత్‌పై మళ్లీ విషం కక్కిన పాక్ ఆర్మీ చీఫ్

- ఆపరేషన్ సిందూర్' దాడులపై ఆసిమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు
- భారత్‌తో పోరాటాన్ని విభిన్న భావజాలాల మధ్య పోరుగా అభివర్ణన
- భారత్ జరిపిన వైమానిక దాడులపై వివాదాస్పద వ్యాఖ్యలు
- భారత వాయుసేన దాడులు తమ భౌగోళిక సమగ్రతను దెబ్బతీశాయని వ్యాఖ్య
- ఘర్షణ సమయంలో భారత్‌లోని 26 లక్ష్యాలను తాము దెబ్బతీశామని వెల్లడి
- కాల్పుల విరమణ కోసం అమెరికా ద్వారా భారత్ బతిమాలినట్లు ప్రచారం




2

# విజయ్ దా సీఎం..

**(మొదటి పేజీ తరువాయి)**

చేయించారు. 1967 సంవత్సరం తర్వాత తమిళనాడును దశాబ్దాల పాటు శాసించిన డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల ఆధిపత్యాన్ని బద్దలు కొడుతూ మరో పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి కావడంతో యావత్ తమిళనాడు ఇప్పుడు పండుగ వాతావరణంలో మునిగిపోయింది. స్టేడియం లోపల, బయట లక్షలాదిగా తరలివచ్చిన అభిమానులు 'దళపతి.. సీఎం దళపతి' అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో విజయ్ తన పాలనా ముద్రను చాటుతూ మూడు అత్యంత కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేసిన తొలి సంతకం రాష్ట్రంలోని సామాన్యులకు పెద్ద ఊరటనిచ్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ ఆయన ఫైలుపై సంతకం చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని కోట్లాది మధ్యతరగతి, పేద కుటుంబాలకు విద్యుత్ భారం తగ్గనుంది. ఇక రెండో సంతకంగా మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ షీ టీమ్స్ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు 'ఈగిల్' వ్యవస్థ తరహాలో స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతూ మూడో సంతకాన్ని పూర్తి చేశారు. ఈ మూడు నిర్ణయాలు విజయ్ పాలనలో ప్రజల అవసరాలకు, భద్రతకు ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో స్పష్టం చేస్తున్నాయి. ప్రమాణ స్వీకార వేదికపై ఆసక్తికర సన్నివేశాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విజయ్, వేదికపై ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి సెల్ఫీ దిగారు. అంతేకాకుండా స్టేడియంలో ఉన్న వేలాది మంది అభిమానులను కవర్ చేస్తూ తన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేయడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తనను సినీ రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టిన అభిమానులు ఇప్పుడు సీఎంగా గెలిపించారన్న కృతజ్ఞత భావంతో ఆయన అందరికీ అభివాదం చేస్తూ మురిసిపోయారు. విజయ్‌తో పాటు ఆయన కేబినెట్‌లో తొమ్మిది మంది మంత్రులు ప్రమాణం చేశారు. సెంగోట్టియన్, ఆధవ అర్జున్, ఎన్ ఆనంద్, డా. కేజీ అరుణ్ రాజ్, నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, పి. వెంకట రమణన్, డా. టీకే ప్రభు మరియు ఎస్. కీర్తనలు విజయ్ జట్టులో మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలో విజయ్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. తాను ఒక సాధారణ డ్రైవర్ కుమారుడిగా మొదలై, జీవితంలో ఎన్నో ఆటుపోట్లు, అవమానాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేసుకున్నారు. మైనార్టీలకు, పేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. "మీరు నన్ను 25 ఏళ్లుగా మీ తమ్ముడిగా, అన్నగా గుండెల్లో పెట్టుకున్నారు. మీ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. కుట్రలు, కుతంత్రాలను దాటుకుని నన్ను నమ్మినందుకు మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని వ్యాఖ్యానించారు.

# వికసిత్ భారత్‌తో తెలంగాణ రైజింగ్ అనుసంధానం చేయండి

హైదరాబాద్ వెలుతురు మే 10:

హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సహకారం, సమన్వయం అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు హాజరైన ఈ కార్యక్రమాన్ని "అభివృద్ధి ఉత్సవం"గా ఆయన అభివర్ణించారు. ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, దేశ అభివృద్ధి దిశగా జరిగే సమష్టి ప్రయత్నమని తెలిపారు. దేశ అభివృద్ధి, జాతీయ భద్రత అంశాలే అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "ముందు భారతదేశం, తర్వాత ప్రజలు, ఆ తరువాతే పార్టీ" అనే సిద్ధాంతంతోనే అందరం ముందుకు సాగాలని ఆయన అన్నారు. ప్రధాని మోదీ ప్రకటించిన వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి తెలంగాణ కూడా భాగస్వామిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా ప్రభుత్వం కృషిచేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని వివరించారు. ఈ లక్ష్య సాధనలో కేంద్ర సహకారం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో గుజరాత్ మోడల్ అభివృద్ధి చెందిందని సీఎం గుర్తు చేశారు. అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ అభివృద్ధి యాత్రలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించగలదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవం, హైదరాబాద్ మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లు, హైదరాబాద్-మచిలీపట్నం 12 లేన్ల రహదారి వంటి ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ ప్రాజెక్టులపై రెండు గంటల సమయం కేటాయించి సమీక్షించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆర్థిక వృద్ధి ప్రధానంగా మహానగరాల నుంచే వస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ఆరు మహానగరాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయని తెలిపారు. ఈ నగరాల అభివృద్ధి ద్వారా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ ఆరు మెట్రో నగరాల అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఇది ప్రాజెక్టుల అమలును వేగవంతం చేస్తుందని ఆయన అన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నేతలు పెద్ద మనసుతో రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తారని తాను ఆశిస్తున్నానని సీఎం పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా ముందుకు సాగుతాయని నమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రానికి పంపినట్లు తెలిపారు.

# బెంగాల్ గెలిచాం.. ఇక లక్ష్యం తెలంగాణ

హైదరాబాద్ వెలుతురు మే 10:

పశ్చిమబెంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిందని ప్రధాని Narendra Modi అన్నారు. అక్కడి ప్రజలు అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా నిలబడి భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పార్టీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ''నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా.. మీ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు'' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ.. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించాయని చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ బెంగాల్‌లో ఓడిపోయింది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని.. రాజ్యాంగ వ్యతిరేక శక్తులేనని వ్యాఖ్యానించారు. అవినీతి, కుటుంబ రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని తెలిపారు. పశ్చిమబెంగాల్ విజయంతో భాజపా కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగిందని ప్రధాని అన్నారు. పదేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో భాజపాకు కేవలం ముగ్గురు ఎమ్మెల్యేలే ఉన్నారని, ఇప్పుడు 200 మందికి పైగా ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఒకప్పుడు భాజపా జెండా ఎగరడం కూడా అసాధ్యంగా భావించిన ప్రాంతాల్లో ఇప్పుడు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. భాజపా ఆవిర్భావ దశలో రెండు లోక్‌సభ స్థానాలు మాత్రమే గెలిచిందని, అందులో ఒకటి తెలంగాణ నుంచే వచ్చిందని మోదీ గుర్తు చేశారు. పార్టీకి అవసరమైన ప్రతిసారి తెలంగాణ ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఇప్పుడు పశ్చిమబెంగాల్‌లో సాధించిన విజయాన్ని తెలంగాణలోనూ పునరావృతం చేయాలని ప్రజలను కోరారు. ''పశ్చిమబెంగాల్ గెలిచాం.. తదుపరి లక్ష్యం తెలంగాణ'' అని స్పష్టం చేసిన ప్రధాని.. ఈసారి రాష్ట్రంలో భాజపా ప్రభుత్వమే ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం కనిపిస్తోందని, తెలంగాణలో రాజకీయ మార్పుకు సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు.

# తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

**సైబరాబాద్ దేశానికి గ్రోత్ ఇంజిన్**

హైదరాబాద్ మహానగరం, ముఖ్యంగా సైబరాబాద్ ప్రాంతం దేశ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా మారిందని ప్రధాని కొనియాడారు. ఐటీ, ఫార్మా, డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, ఈవీ తయారీ, డేటా సెంటర్లు వంటి రంగాల్లో తెలంగాణ విశేషంగా ముందుకు వెళ్తోందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని చెప్పారు. ఇక్కడి యువత నైపుణ్యం, మౌలిక వసతులు, పారిశ్రామిక వాతావరణం కారణంగానే అనేక బహుళజాతి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. దీంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు.

**వరంగల్‌కు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్**

వరంగల్‌లో ఏర్పాటు కానున్న 'పీఎం మిత్ర' కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ టెక్స్‌టైల్ రంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. రూ.1,695.54 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని టెక్స్‌టైల్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ పార్క్ ద్వారా తయారీ యూనిట్లు, ఎగుమతులు, ముడిసరుకు సరఫరా వ్యవస్థలు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దేశ టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

**జహీరాబాద్‌లో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ.2,360.54 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పారిశ్రామిక పెట్టుబడులు భారీగా ఆకర్షితమవుతాయని కేంద్రం భావిస్తోంది. ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ ఆధారిత వ్యవస్థలు ఇందులో ఏర్పాటు కానున్నాయి. ఈ స్మార్ట్ సిటీ ద్వారా దేశీయ, విదేశీ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు మరింత పెరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. పరిశ్రమల విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**రహదారులు, రైల్వేల అభివృద్ధికి ప్రాధాన్యం**

జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. తెలంగాణలో కూడా పలు కీలక రహదారి ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి 167 విస్తరణలో గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ.3,175 కోట్లతో చేపట్టిన పనులను ప్రారంభించారు. ఈ రహదారి అభివృద్ధి ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడనుంది.

అదేవిధంగా రూ.1,243 కోట్లతో చేపట్టిన 118 కిలోమీటర్ల కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టు, రూ.292 కోట్లతో నిర్మిస్తున్న 21 కిలోమీటర్ల కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ లైన్లను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రైల్వే రవాణా సామర్థ్యం పెరిగి సరుకు రవాణా వేగవంతం కానుంది.

**ఇంధన రంగంలో కీలక అడుగు**

హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద రూ.611 కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఇంధన నిల్వ, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇంధన మౌలిక వసతులను కేంద్రం అభివృద్ధి చేస్తోందని ప్రధాని తెలిపారు.

**తెలంగాణకు కేంద్రం పూర్తి సహకారం**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మౌలిక వసతులు, పరిశ్రమలు, రవాణా, ఉపాధి, టెక్స్‌టైల్, డిజిటల్ రంగాల్లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి అంటే దేశాభివృద్ధేనని వ్యాఖ్యానించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని అన్నారు. తెలంగాణ యువత దేశ అభివృద్ధిలో ముందుండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో తెలంగాణ కీలక భాగస్వామిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పీఎంఓలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ వెలుతురు మే 10:

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత బలపడితే దేశ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి కీలకంగా నిలుస్తున్న ప్రధాన మహానగరాల్లో అభివృద్ధి ప్రాజెక్టులకు అనుమతులు వేగంగా లభించేలా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రధాని మోడీని కోరారు. ప్రధాని తెలంగాణ పర్యటన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల సభలో సీఎం ఈ కీలక ప్రతిపాదన చేశారు. దేశంలో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి ఆరు ప్రధాన మహానగరాలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, రవాణా వ్యవస్థ బలోపేతం, పట్టణ ప్రణాళిక, ఐటీ మరియు సేవారంగాల పురోగతి దేశ జీడీపీ వృద్ధిపై నేరుగా ప్రభావం చూపుతున్నాయని వివరించారు. అయితే జాతీయ ప్రాధాన్యత కలిగిన అనేక ప్రాజెక్టులు వివిధ శాఖల అనుమతుల కోసం నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి కార్యాలయం పరిధిలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి, దేశానికి అత్యంత కీలకమైన మెట్రో నగరాల అభివృద్ధి ప్రాజెక్టులకు వేగంగా క్లియరెన్స్‌లు మంజూరు చేసే విధానం తీసుకురావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలోని పలు మంత్రిత్వ శాఖలు, పర్యావరణ, రవాణా, పట్టణాభివృద్ధి, రైల్వే, ఆర్థిక శాఖల మధ్య సమన్వయాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తే ప్రాజెక్టుల అమలు వేగవంతం అవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరం దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరాల్లో ఒకటిగా మారిందని సీఎం పేర్కొన్నారు. ఐటీ, ఫార్మా, డేటా సెంటర్లు, స్టార్టప్‌లు, మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. ప్రపంచస్థాయి కంపెనీలు హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకుంటున్న తరుణంలో, రవాణా, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రైల్వే కనెక్టివిటీ, అర్బన్ మొబిలిటీ వంటి ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు అవసరమని కేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దేశ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలంటే మెగా నగరాల అభివృద్ధి అత్యంత అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలు, సేవారంగ సంస్థలు ప్రధానంగా మహానగరాల చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయని, అందువల్ల నగరాభివృద్ధి అంటే కేవలం మౌలిక సదుపాయాల పెంపు మాత్రమే కాకుండా ఉద్యోగావకాశాల విస్తరణ కూడా అవుతుందని వివరించారు. అభివృద్ధి చెందిన నగరాలు దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ఇంజిన్లుగా పనిచేస్తాయని పేర్కొన్నారు.

# భారత్‌పై మళ్లీ విషం కక్కిన పాక్ ఆర్మీ చీఫ్

ఢిల్లీ వెలుతురు మే 10:

భారత్‌పాకిస్థాన్ సరిహద్దుల్లో గతేడాది చోటు చేసుకున్న సైనిక ఘర్షణలపై పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ మరోసారి నోరు పారేసుకున్నారు. రావల్పిండిలోని జనరల్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారత్‌తో జరిగిన ఆ పోరాటం కేవలం సరిహద్దు ఘర్షణ మాత్రమే కాదని, అది రెండు భిన్నమైన సిద్ధాంతాల మధ్య జరిగిన యుద్ధమని అభివర్ణించారు. 'మార్కా ఎహక్' పేరుతో పాకిస్థాన్ జరుపుకుంటున్న ఈ ఉత్సవాల్లో ఆయన భారత్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. గతేడాది మే నెలలో భారత వాయుసేన జరిపిన మెరుపు దాడులను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తూనే, పాక్ సైన్యం గొప్పతనాన్ని చాటుకునేందుకు విఫలయత్నం చేశారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన తరుణంలో మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలు దక్షిణాసియా రాజకీయాల్లో మళ్లీ కాక రేపుతున్నాయి. గతేడాది జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు బరితెగించి 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఘటన దేశవ్యాప్తంగా ఆగ్రహం కలిగించింది. దీనికి దీటుగా స్పందించిన భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. మే 7వ తేదీన భారత యుద్ధ విమానాలు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాయి. తొమ్మిది శిబిరాలను ధ్వంసం చేసి, సుమారు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు భారత్ ప్రకటించింది. ఈ దాడులతో ఉక్కిరిబిక్కిరి అయిన పాకిస్థాన్, ఆ తర్వాత విఫలయత్నంగా కొన్ని ప్రతిదాడులకు ప్రయత్నించినప్పటికీ భారత సైన్యం వాటిని సమర్థవంతంగా అడ్డుకుంది. నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, మే 10న హాట్‌లైన్ చర్చల ద్వారా ఇరు దేశాల సైన్యాధికారులు కాల్పుల విరమణకు అంగీకరించారు. అయితే, ఈ వాస్తవాలను పక్కనపెట్టి ఆసిమ్ మునీర్ ఇప్పుడు కొత్త నాటకానికి తెరలేపారు.

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

హైదరాబాద్ వెలుతురు మే 10:

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాస్తూ తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం ఇవ్వాలని ఆయన లేఖలో విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రైల్వే ప్రాజెక్టులు, రహదారి కారిడార్లు వంటి కీలక అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు వెంటనే ఆమోదం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు కోరారు. రూ.38,595 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ విస్తరణను జాయింట్ వెంచర్ మోడల్‌లో చేపట్టాలని సూచించారు. నగర ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**మూసీ పునరుజ్జీవనానికి జాతీయ హోదా**

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టును జాతీయ స్థాయి అర్బన్ రివర్ రీస్టోరేషన్ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు. దీనికి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కూడా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని ఆయన లేఖలో పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర, దక్షిణ భాగాలకు వెంటనే ఆర్థిక, పరిపాలనా ఆమోదాలు ఇవ్వాలని టీపీసీసీ డిమాండ్ చేసింది. అదేవిధంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును 100 శాతం కేంద్ర నిధులతో చేపట్టాలని కోరింది. ఇవి తెలంగాణ రవాణా వ్యవస్థను పూర్తిగా మార్చగల ప్రాజెక్టులని ఆయన అభిప్రాయపడ్డారు.

**భారీ రహదారి, ఎక్స్‌ప్రెస్ కారిడార్ ప్రతిపాదనలు**

హైదరాబాద్-అమరావతి-బందర్ పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని లేఖలో సూచించారు. అలాగే హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలని కోరారు. నగరంలో రేడియల్ రోడ్ల నిర్మాణానికి రూ.45 వేల కోట్ల సహాయం అవసరమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చే ప్రాజెక్టుకు కూడా కేంద్ర నిధులు ఇవ్వాలని టీపీసీసీ విజ్ఞప్తి చేసింది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సహకారం కోరారు. హైదరాబాద్ ఫ్యాబ్ సిటీని సెమీ కండక్టర్ మిషన్ కింద ప్రాధాన్యత ఇవ్వాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. కేంద్ర పరిశీలనలో ఉన్న సెమీకండక్టర్ ప్రాజెక్టులకు తుది ఆమోదం ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇది తెలంగాణను టెక్నాలజీ హబ్‌గా మార్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి NOC వచ్చేలా కేంద్రం చొరవ చూపాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని పూర్తి స్థాయి యూనిట్‌గా అభివృద్ధి చేయాలని కూడా లేఖలో పేర్కొన్నారు. కొత్త జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**విభజన హామీలపై తీవ్ర వ్యాఖ్యలు**

తెలంగాణ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని టీపీసీసీ డిమాండ్ చేసింది. తెలంగాణకు నిధులు, ప్రాజెక్టులు ఇవ్వకపోతే కేంద్రం వైఖరిపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని హెచ్చరించారు. "తెలంగాణకు న్యాయం జరిగితేనే మోదీకి రాష్ట్రంపై ప్రేమ ఉన్నట్లు భావిస్తాం" అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను టీపీసీసీ తీవ్రంగా ఖండించింది. తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు ఆపాలని కోరింది. అమరవీరుల త్యాగాలకు గౌరవం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాలని లేఖలో సూచించారు. మొత్తం మీద టీపీసీసీ అధ్యక్షుడి ఈ బహిరంగ లేఖ తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై కేంద్రంపై ఒత్తిడి పెంచేలా ఉంది. మౌలిక వసతులు, రహదారులు, మెట్రో, రైల్వే, పారిశ్రామిక అభివృద్ధి వంటి అనేక అంశాలను సమగ్రంగా ప్రస్తావిస్తూ తక్షణ చర్యలు అవసరమని ఆయన కేంద్రాన్ని కోరారు.

# ఏపీలో ఏఐ వైద్య విప్లవం

అమరావతి వెలుతురు మే 10:

ఆధునిక సాంకేతికతను సామాన్యుడి ఆరోగ్యంతో ముడిపెడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన అడుగు వేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేసే 'సంజీవని' డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రోగ నిర్ధారణ నుంచి చికిత్స వరకు, ఆపై కోలుకునే వరకు ప్రతి దశలోనూ రోగిని పర్యవేక్షించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, వ్యాధి తీవ్రతను తగ్గించడం ద్వారా మరణాల రేటును తగ్గించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పౌరుడి ఆరోగ్యాన్ని ఒక డిజిటల్ నెట్‌వర్క్‌తో అనుసంధానించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి నరేంద్ర చంద్రబాబు నాయుడు ఆలోచనల నుంచి పుట్టిన ఈ 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ప్రాథమిక వైద్యం పొందే వీలు కలుగుతుంది. గత ఏడాది జులైలో కుప్పంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ సహకారంతో ప్రారంభమైన ఈ పైలట్ ప్రాజెక్టు ప్రస్తుతం తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు విస్తరించింది. కుప్పం పరిధిలో దాదాపు 3 లక్షల మందిని ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు అనుసంధానం చేయగా, అక్కడ అద్భుతమైన ఫలితాలు రావడంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్త అమలుకు మొగ్గు చూపింది. ఇప్పటికే 33 మండలాల్లోని ప్రాంతీయ ఆసుపత్రులు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వేలాది మంది ప్రజలు ఈ సేవలను పొందుతుండటం గమనార్హం. ఈ వ్యవస్థ ప్రధానంగా 'ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ డెలివరీ ప్లాట్‌ఫామ్' (IHDP) ద్వారా పనిచేస్తుంది. దీని ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.75 లక్షల మంది ఓపీ సేవలు పొందగా, లక్షలాది మందికి ఉచితంగా మందుల పంపిణీ జరిగింది. కేవలం మందులు ఇవ్వడమే కాకుండా, రోగికి అవసరమైన ల్యాబ్ పరీక్షలు నిర్వహించి, ఆ నివేదికలను డిజిటల్‌గా భద్రపరుస్తారు. దీనివల్ల రోగి ఏ ఆసుపత్రికి వెళ్లినా పాత రిపోర్టులు చేతిలో లేకపోయినా, డాక్టర్లు కేవలం క్లిక్ ద్వారా వారి ఆరోగ్య చరిత్రను తెలుసుకునే వీలుంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సంజీవని సిటిజన్ వెల్నెస్ యాప్' ద్వారా ఇప్పటికే వేల సంఖ్యలో ప్రజలు స్పెషలిస్ట్ కన్సల్టేషన్లు పొందుతున్నారు. టెలి కన్సల్టేషన్ విభాగంలో కూడా ఈ ప్రాజెక్టు ద్వారా లక్షకు పైగా మందికి నిపుణులైన వైద్యులు సలహాలు అందించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. సాంకేతిక పరమైన మౌలిక సదుపాయాలు, ఐటీ వ్యవస్థల ఏర్పాటుకు కొంత సమయం పడుతుండటంతో జులైలో ప్రారంభం కావాల్సిన ప్రాజెక్టు మరో నాలుగైదు నెలలు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. అయితే, ప్రభుత్వం ఈ లోపు నియామక ప్రక్రియపై దృష్టి సారించింది. ప్రతి జిల్లాకు ఒక సమన్వయ అధికారిని, ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్రం స్థాయిలో రోగులకు మార్గదర్శనం చేసేందుకు పేషెంట్ కేర్ మేనేజర్లు, కోఆర్డినేటర్లను కూడా అందుబాటులోకి తెస్తారు. 108 మరియు 104 సంచార వైద్య సేవలను కూడా సంజీవనిలో విలీనం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు వేగవంతమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

# చంద్రబాబు, పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లి పరామర్శించిన ప్రధాని



- హైదరాబాద్ పర్యటనలో ఏపీ నేతలతో ప్రధాని భేటీ
- ముందుగా పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మోదీ
- సైనస్ శస్త్రచికిత్స అనంతరం పవన్‌ను పరామర్శించిన ప్రధాని
- చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వక భేటీ
- మంత్రి లోకేశ్‌తో కలిసి స్వాగతం పలికిన టీడీపీ నేతలు

- **ఆత్మీయంగా సాగిన రాజకీయ, వ్యక్తిగత చర్చలు**
- **రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కూడా ప్రస్తావన**
- **ప్రముఖ నేతల నివాసాలకు ప్రధాని సందర్శనపై ప్రాధాన్యం**
- **హైదరాబాద్‌లో ప్రత్యేక రాజకీయ ఉత్సాహం**

హైదరాబాద్ వెలుతురు మే 10:

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాసాలను సందర్శించారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఈ రెండు నేతల ఇళ్లకు వెళ్లిన ప్రధాని, తొలుత పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. సైనస్ సమస్య కారణంగా ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రధాని మోదీ స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



అనంతరం ప్రధాని చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు. అక్కడ ఆయనకు చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో పరస్పర కుశల ప్రశ్నలు, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ సందర్శనలు పూర్తిగా వ్యక్తిగత, పరామర్శాత్మక స్వభావంలో జరిగినప్పటికీ, రాజకీయంగా ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీ అభివృద్ధి, కేంద్ర-రాష్ట్ర సహకారం వంటి అంశాలపై కూడా సంక్షిప్తంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ వరుసగా రెండు కీలక నేతల నివాసాలకు వెళ్లడం హైదరాబాద్ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## పదో తరగతి పరీక్షలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన పట్కారి సహస్ర



- **పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన పట్కారి సహస్రకు చిన్నారులతో సన్మానం**

హైదరాబాద్ వెలుతురు మే 10:

మెహిదీపట్నం గుడిమల్కాపూర్ లో న్యూ ఎడెన్ స్కూల్లో 10.వ తరగతి చదువుతున్న సహస్ర 600 మార్కులకు 575 మార్కులు ఉత్తీర్ణత సాధించి స్కూల్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది స్కూల్ యాజమాన్యం సహస్రకు అభినందనలు తెలియజేశారు అనంతరం సహస్ర మాట్లాడుతూ కష్టపడి చదివితే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని సహస్ర అన్నారు కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల పేరు కూడా నిలబెట్టాలని సహస్ర తెలిపారు స్కూల్ ఫస్ట్ ర్యాంకు రావడంతో పట్కారి సహస్ర తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు...


## టేబుల్ మోసిన సీఎం విజయ్.. ప్రజలతో సెల్ఫీ




- **విజయ్ ప్రమాణస్వీకారం అనంతరం సిబ్బందితో కలిసి టేబుల్ మోసి తన సరళతను చాటుకున్నారు**
- **రాహుల్ గాంధీతో విజయ్ స్నేహపూర్వకంగా కలిసి కార్యకర్తలకు అభివాదం చేయడం ఆకర్షణగా నిలిచింది.**

తమిళనాడు వెలుతురు మే 11:

తమిళనాడు ముఖ్యమంత్రిగా టీవీకే (TVK) అధినేత విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో పలు ఆసక్తికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. ప్రమాణస్వీకారం అనంతరం గవర్నర్ ఆర్లేకర్‌తో గ్రూప్ ఫోటో సందర్భంగా.. సిబ్బంది వేదికపై ఉన్న టేబుల్స్‌ను తొలగించారు. ఈ క్రమంలో సీఎం విజయ్ వారికి సాయం చేస్తూ టేబుల్‌ను మోశారు. అనంతరం ప్రజలతో ఆయన సెల్ఫీ దిగారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ వేడుకకు హాజరు కాగా.. ఆయనతో విజయ్ స్నేహంగా మెలిగారు. ఇద్దరూ కలిసే ఇరు పార్టీల కార్యకర్తలకు అభివాదం చేశారు. వారిద్దరి మధ్య స్నేహం అందరి దృష్టిని ఆకర్షించింది.






# శాస్త్ర సాంకేతిక ప్రగతిలో - భారత్ పురోగతి

టెక్నాలజీ నేటి ప్రపంచ అభివృద్ధికి ప్రధాన ఆధారం. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో భారతదేశం సాధించిన సాంకేతిక విజయాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం మే 11న జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 1998 మే 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో భారతదేశం విజయవంతంగా అణు పరీక్షలు నిర్వహించడం దేశ చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది. "ఆపరేషన్ శక్తి" పేరుతో నిర్వహించిన ఈ పరీక్షలు భారతదేశాన్ని ప్రపంచ అణు శక్తి దేశాల జాబితాలో నిలబెట్టాయి. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో, ప్రముఖ శాస్త్రవేత్త A. P. J. అబ్దుల్ కలాం సారథ్యంలో ఈ ఘనత సాధించబడింది. ఈ విజయాన్ని గుర్తిస్తూ 1999 నుంచి మే 11ను జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించారు.


భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన Technology Development Board (TDB) దేశీయ సాంకేతికత అభివృద్ధికి కీలకంగా పనిచేస్తోంది. పరిశోధనలను ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చేందుకు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు, స్వదేశీ సాంకేతికతను వాణిజ్యీకరించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. ప్రతి సంవత్సరం జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమలు, స్టార్టప్‌లకు జాతీయ అవార్డులు అందజేస్తుంది. ఈ అవార్డులు దేశంలో ఆవిష్కరణల సంస్కృతిని మరింత బలపరుస్తున్నాయి.

2026లో భారతదేశం సాంకేతిక రంగంలో మరింత వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (AI), సెమీ కండక్టర్ తయారీ, అంతరిక్ష పరిశోధనలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, రక్షణ సాంకేతికత రంగాల్లో విశేష పురోగతి కనిపిస్తోంది. ఇస్రో (Indian Space Research Organisation ISRO )చేపట్టిన చంద్రయాన్, ఆదిత్యL1, గగనయాన్ వంటి ప్రాజెక్టులు ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్టను పెంచాయి. విదేశీ ఉపగ్రహాలను తక్కువ ఖర్చుతో ప్రయోగించే సామర్థ్యంతో భారత్ అంతరిక్ష రంగంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. రక్షణ రంగంలో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలమెంట్ ఆర్గనైజేషన్ (DRDO) ఆధునిక సాంకేతిక ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేస్తోంది. ఇటీవల స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన స్మార్ట్ ఆయుధ వ్యవస్థలను విజయవంతంగా పరీక్షించడం దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది.

ప్రస్తుతం భారతదేశం AI రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. 2026లో నిర్వహించిన "India AI Impact Summit" లో బాధ్యతాయుతమైన, సమగ్ర AI అభివృద్ధిపై కీలక చర్చలు జరిగాయి. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పరిపాలన రంగాల్లో AI వినియోగాన్ని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. నాస్కామ్ అంచనాల ప్రకారం భారత టెక్నాలజీ రంగ ఆదాయం 2026 నాటికి 300 బిలియన్ డాలర్లను దాటే అవకాశముంది. గ్లోబల్ టెక్ కంపెనీలు భారత్‌ను ప్రధాన ఇన్నోవేషన్ కేంద్రంగా మార్చేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల వరకు సాంకేతిక సేవలు విస్తరిస్తున్నాయి. 5G సేవలు వేగంగా అందుబాటులోకి వస్తుండగా, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. UPI వ్యవస్థ ద్వారా ప్రతిరోజూ కోట్లాది డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాల స్థాయి నుంచే AI, కోడింగ్, రోబోటిక్స్ వంటి అంశాలను ప్రవేశపెడుతున్నారు.

నేటి డిజిటల్ ప్రపంచానికి అత్యంత కీలకమైన ఫైబర్ ఆప్టిక్ టెక్నాలజీ ప్రాధాన్యం కూడా ఎంతో గొప్పది. ఇంటర్నెట్, 5G కమ్యూనికేషన్, డిజిటల్ డేటా ప్రసారం, అంతర్జాతీయ కమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌పైనే ఆధారపడి ఉన్నాయి. ప్రపంచాన్ని "అరచేతిలోకి" తీసుకొచ్చిన ఈ సాంకేతిక విప్లవానికి భారతీయ మూలాలు ఉన్న శాస్త్రవేత్త నరిందర్ సింగ్ కపానీ విశేష సేవలు అందించారు. ఆప్టికల్ ఫైబర్ టెక్నాలజీ అభివృద్ధికి పునాది వేసి ఆధునిక టెలికమ్యూనికేషన్ రంగానికి కొత్త దిశ చూపించారు. నేడు వేగవంతమైన ఇంటర్నెట్, వీడియో కాల్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ బ్యాంకింగ్ వంటి సేవలు ఫైబర్ టెక్నాలజీ వల్లే సాధ్యమవుతున్నాయి. అందువల్లే వారిని ఆయనను ప్రపంచవ్యాప్తంగా "Father of Fiber Optics"గా గౌరవిస్తారు.




దేశవ్యాప్తంగా స్టార్టప్ సంస్కృతి కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, అగ్రిటెక్, ఎడ్యుటెక్ రంగాల్లో భారత యువత కొత్త ఆవిష్కరణలతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా నిలిచింది. యువ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, పరిశోధకులు సాంకేతిక రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు.

ఈ జాతీయ స్థాయి సాంకేతిక పురోగతికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం కూడా టెక్నాలజీ రంగంలో వేగంగా ఎదుగుతోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడానికి పలు కీలక కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా హైదరాబాద్‌ను "AI City"గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తోంది. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ తయారీ, డేటా సెంటర్ల అభివృద్ధి కోసం అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

అమెరికాకు చెందిన Blaize సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని AI, డేటా సెంటర్లు, సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే Telangana AI Innovation Hub (TAIH) ఏర్పాటు చేసి యువతలో AI పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్‌ను భవిష్యత్తు సాంకేతిక నగరంగా మార్చేందుకు "Bharat Future City" ప్రాజెక్టును కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, AI ఆధారిత సేవలు, గ్లోబల్ టెక్ కంపెనీల పెట్టుబడులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ITIలను Advanced Technology Centres (ATCs)గా మార్చుతోంది. Tata Technologies సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాల్లో AI, ఆటోమేషన్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు. అలాగే Microsoft వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలతో కలిసి లక్షలాది మంది యువతకు AI శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో AI Center of Excellence ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

అదనంగా, హైదరాబాద్ నగరాన్ని "స్మార్ట్ సిటీ"గా అభివృద్ధి చేయడానికి AI ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ సేఫ్టీ, డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థలను అమలు చేస్తున్నారు. నగరంలోని CCTV నెట్‌వర్క్‌ను AIతో అనుసంధానం చేసి భద్రతా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ చర్యలు తెలంగాణను దేశంలోనే ప్రముఖ టెక్నాలజీ గమ్యస్థానంగా నిలబెడుతున్నాయి.

నేటి ప్రపంచంలో టెక్నాలజీ మన దైనందిన జీవితంలో విడదీయరాని భాగంగా మారింది. మొబైల్ ఫోన్ల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు ప్రతి రం గం సాంకేతికత ఆధారంగానే ముందుకు సాగుతోంది. భారతదేశం ఇప్పుడు కేవలం టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా, ప్రపంచానికి సాంకేతిక పరిష్కారాలను అందించే దేశంగా ఎదుగుతోంది. యువతలో ఆవిష్కరణలు, పరిశోధనలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జాతీయ సాంకేతిక దినోత్సవం ఒక ప్రేరణగా నిలుస్తోంది. 2026లో AI, డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఇన్నోవేషన్ రంగాల్లో భారత్ వేగంగా ఎదుగుతుండటం దేశ సాంకేతిక భవిష్యత్తుకు కొత్త ఆశలను కలిగిస్తోంది. "జై జవాన్ - జై కిసాన్ - జై విజ్ఞాన్" అనే నినాదంతో భారత్ ప్రపంచ సాంకేతిక రంగంలో మరింత శక్తివంతమైన దేశంగా ముందుకు సాగాలని ప్రతి భారతీయుడు ఆకాంక్షిస్తున్నాడు.



డా. లోలపు తిరుపతి,
పాలసీ అనాలిస్ట్.




# తెలంగాణలో ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ వర్క్‌షాప్

- **హాజరును కానున్న 6 దేశాల ప్రతినిధులు**
- **11, 12 తేదీల్లో నిర్వహణ**
- **ముఖ్య అతిథులుగా గవర్నర్, మంత్రి కొండా సురేఖ**
- **అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు విదేశీ ప్రతినిధుల పర్యటన**

హైదరాబాద్, మే 10 (వెలుతురు):

పెద్ద పిల్లి జాతుల సంరక్షణపై తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా భారత విదేశాంగ శాఖతో కలిసి ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. పులులు, చిరుతపులుల సంరక్షణ చర్యలపై ప్రధానంగా ఈ కార్యక్రమం కొనసాగనుంది. పులి, సింహం, జాగ్వార్, చిరుత, స్నో లియోపార్డ్, చీతా, ప్యూమా వంటి పెద్ద పిల్లి జాతుల సంరక్షణలో అంతర్జాతీయ సహకారం, వన్యప్రాణి ఆవాసాల పరిరక్షణ, జీవ వైవిధ్య రక్షణ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని, ప్రకృతి సంరక్షణ ఆధారిత అభివృద్ధి, జీవ వైవిధ్య పరిరక్షణ పట్ల తెలంగాణ ప్రభుత్వ కట్టుబాటును ఈ కార్యక్రమం ప్రతిబింబించనుందని అటవీ దళాల అధిపతి డాక్టర్ సీ.సువర్ణ తెలిపారు..

మొదటి రోజు హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్, మంత్రి కొండా సురేఖ హాజరు కానున్నారు..

మొదటగా ఫోటో ప్రదర్శన నిర్వహించి, తెలంగాణ అటవీ శాఖ చేపడుతున్న వన్యప్రాణి సంరక్షణ చర్యలు, వేట నిషేధిత కార్యక్రమాలు, అడవుల పునరుద్ధరణ, వాటి సంరక్షణ వంటి అవగాహన కార్యక్రమాలను ఫోటోల రూపంలో ప్రదర్శించనున్నారు. రెండో రోజు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు ఫీల్డ్ విజిట్ నిర్వహించనున్నారు. దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్‌లలో ఒకటైన అమ్రాబాద్‌లో అమలు చేస్తున్న పులుల సంరక్షణ చర్యలు, ఆవాసాల నిర్వహణ విధానాలను విదేశీ ప్రతినిధులు పరిశీలించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు ఫ్రాన్స్, మలేషియా, రష్యా, శ్రీలంక, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, టర్కీ దేశాల ప్రతినిధులతో పాటు హైదరాబాద్‌లోని కాన్సుల్ జనరల్స్, దౌత్యవేత్తలను ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. "ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (IBCA)" కార్యక్రమంపై అవగాహన పెంపుతో పాటు వన్యప్రాణి సంరక్షణలో ఉత్తమ విధానాల పరస్పర మార్పిడికి ఈ కార్యక్రమం వేదిక కానుందని పేర్కొన్నారు.

# తెలంగాణపై బీజేపీది సవతి తల్లి ప్రేమ

- **మా పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా?**
- **మాపై ఎందుకంత నిర్లక్ష్యం?**
- **కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఏపితో పోలిస్తే.. తెలంగాణకు అన్యాయం**
- **బీజేపీ ఎంపీల నోరు పెద్దది.. ప్రతిపక్షాలను విమర్శించడంలో దిట్ట**
- **బీజేపీ, బీఆర్ఎస్ బలం ఫెవికాల్ కంటే ధృడమైనది**
- **మోది పై విమర్శలు గుప్పించిన విప్ యెన్నం**

హైదరాబాద్, మే10 (వెలుతురు ):

తెలంగాణపై మొదటి నుంచి బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఈ 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు తీసుకువచ్చిన నిధులు ఎంతో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాగానే ఏడు మండలాలను ఆంధ్రాకు కేటాయించారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు.. కాని ఆ తర్వాత ఆ ఊసే లేదని బీజేపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో శరవేగంతో పనులు జరుగుతున్నాయని వివరించారు.



మా పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా? ఎందుకంత నిర్లక్ష్యం అని కేంద్రంలోని సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ ఏర్పాటు చేసి.. పారిశ్రామిక రాయితీలు ఇస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు కూడా రాయితీ ఇస్తే బాగుండేది.. కాని తీరని అన్యాయం చేశారంటూ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం లేకపోవడంతో సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీని చూడగానే తెలంగాణ బీజేపీ నాయకులు నోరుమెదపడం లేదని వ్యంగ్యంగా అన్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే.. తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు. ఏపీకి నిధుల వరద పారుతోందని గుర్తు చేశారు. ఎంపీలను గెలిపించిన తెలంగాణను మాత్రం పట్టించుకోవడం లేదంటూ కేంద్రంలోని బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు.

బీజేపీ ఎంపీల నోరు పెద్దదని.. ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం నిధులు, ప్రాజెక్టులు తీసుకువద్దామన్న ఆలోచన చేయడం లేదంటూ బీజేపీ ఎంపీలకు చురకలంటించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు అనేక అడ్డంకులు కల్పించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ఏటీఎం సెంటర్ అని, కేసీఆర్ కుటుంబం అవినీతిమయం అని ప్రధాని మోదీ అనేక సార్ల పేర్కొన్నారని తెలిపారు. దేశంలోనే అత్యధిక అవినీతి కలిగిన రాష్ట్రం తెలంగాణ అని మోదీ విమర్శించారని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఈగ కూడా వాలనివ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఒక్క కేసుపైన కూడా విచారణ జరపలేదని వివరించారు. వంద రోజుల్లో కేసీఆర్‌ను జైలులో వేస్తామని బీజేపీ నాయకులు అన్నారని గుర్తు చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ బలం ఫెవికాల్ కంటే ధృడమైనదని అభివర్ణించారు. గతంలో కేంద్రం తీసుకువచ్చిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. కేసీఆర్ కుటుంబంపై ఐటీ, ఈడీ, సీబీఐలు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఎందుకు సహకరించడం లేదు..? అని సందేహం వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి ఎడ్యుకేషన్‌కు సంబంధించిన రుణాలను మినహాయించాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.

అమరావతి నిర్మాణం కోసం వేల కోట్లు ఇస్తున్న కేంద్రం భారత్ ఫ్యూచర్ సీటికి రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఫ్యూచర్ సీటి నిర్మాణానికి బీజేపీ నాయకులు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తోకపట్టుకుని కుర్చీలో కూర్చోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. అవినీతి బీఆర్ఎస్ నాయకులను జైలులో పెట్టాలన్న ఆలోచన బీజేపీకి లేదని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర హితం కోసం ఆలోచడం లేదని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# కార్మికులను బానిసలుగా మార్చే 4లేబర్ కోడ్స్ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి : జీవో కాపీల దహనం

- **కీలుకానీ లక్ష్మణ్....**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 10:

సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ శుభం హోటల్ భవన నిర్మాణ కార్మికుల సంఘం అడ్డా దగ్గర నాలుగు లేబర్ కోడ్స్ అమలు జీవో కాపీలను దహనం చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ....



కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధాన్ని మొదలుపెట్టిందని ఈ లేబర్ కోడ్స్ కార్మికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనన్నారు. ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల కాడ కార్మిక హక్కులను తాకట్టు పెట్టిన కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తొక్కిందని కార్మిక వర్గంపై సాగుతున్న ఈ పాశవిక దాడిని సహించేది లేదన్నారు.ఢ

చరిత్రలో ఏ రోజూ పాలకులు కార్మిక హక్కులను ఉచితంగా ఇవ్వలేదనీ లాటీలు తూటాలను ఎదిరించి పోరాటాల ద్వారానే మనం హక్కులను సాధించుకున్నాం పెద్ద పెద్ద పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల అండతో ఏర్పడిన ఈ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపే వరకు కార్మిక వర్గం ఐక్యతతో పోరాడాలన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు పాషా. శ్రీశైలం, యాదవరెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూరారం రాజీవ్ గృహకల్పలో 36 వ ఉచిత వైద్య శిబిరం



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 10:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సాయిబాబా నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పలో బికేఅర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 36వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన

ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ & కోఆర్డినేటర్ కమిటీ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య సేవలు ఉపయోగించుకోవాలని అన్నారు. వైద్యంతో పాటు పేద మధ్యతరగతి పిల్లలకు విద్యకు ఎలాంటి ఇబ్బందులున్న బికేఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు.

కాలనీ ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే సమస్య పరిష్కారమయ్యే వరకు అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. మాకు సహకరిస్తున్న సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందానికి బిగ్ న్యూస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు AR సాదు యాదవ్ నరసింహారెడ్డి, గజేంద్ర, ప్రజా గాయకుడు శంకర్, శ్రీశైలంయాదవ్, అరుణ్ రెడ్డి, జగన్ ముదిరాజ్, మరియు రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రజలు పాల్గొన్నారు

## ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంతటి రాజు గౌడ్ 25 వసంతల పెండ్లి రోజు



- **వేడుకల్లో పాల్గొన్న వైయస్సార్ మాధగోని జంగయ్య గౌడ్**

మంచాల వెలుతురు మే 10:

మంచాల మండలం ఆరుట్ల గ్రామం లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంత టి రాజు గౌడ్ గౌడ్,25 వసంతాల పెండ్లి రోజుసందర్భంగా.శనివారము రాత్రి జరిగిన పెండ్లిరోజు వేడుకల్లో పాల్గొన్న ఆరుట్ల గ్రామ శ్రీమహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ సభ్యులుదంపతులు అంతటి రాజు గౌడ్ ఝాన్సీని శాలువతో ఘనంగా సన్మానించి కేక్ కట్చేయించి ఆశీర్వదించి శుభాకాం క్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో వై యస్సార్ మాధగోనిజంగయ్య గౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ నూతనగంటి కృష్ణ నుకం బాలరాజు ముదిరాజ్ కొండూరిశేఖర్ఆమంచ సంతోష్ మాదపాకుల కృష్ణ మాదపాకుల శ్రీనివాస్ అల్లంపల్లి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా "బండారి" ఆత్మీయ సమ్మేళనం.... కార్యక్రమాని ఆతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 10:

సిఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి శ్రీ ఆదిత్య ఉత్సవ్ బ్యాంక్విట్ హాల్ నందు బండారి ఫ్యామిలీ ఆహ్వానం మేరకు నిర్వహించిన బండారి వెల్ఫేర్ అసోసియేషన్ అద్వర్యం లో నిర్వహించిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అతిథిగా హాజరయ్యారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... కుటుంబ ఆత్మీయ సమ్మేళనాలు మనలో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు మన మూలాలను తెలియజేస్తాయన్నారు.

ఈకార్యక్రమంలో బండారి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దశరథ్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ ప్రకాష్, ట్రెజరర్ మల్లేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్, రాజకుమార్ ముదిరాజ్, మైసాగౌడ్, వేణు ముదిరాజ్, కిషోర్ ముదిరాజ్, అనిల్, బండారి ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ న్యాయమైన బీసీ సమస్యలు పరిష్కరించాలని నిరసన



- **అసెంబ్లీ ఎదురుగా గన్ పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 10:

ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ వస్తున్న సందర్భంగా బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈరోజు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న లింగం గౌడ్ మాట్లాడుతూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని జనాభాలో 60 శాతం ఉన్నటువంటి బీసీలు ఏ రంగాల్లోనైనా 20 శాతం దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్సీ ఎస్టీలు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్నారని,అగ్రకులాలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా వాళ్ల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్నారని బీసీలకే తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. జాతీయస్థాయిలో బీసీలను లెక్కించాలని ఎవరి జనాభా ఎంత ఉందో తెలిస్తేనే వారికి రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉంటుందని అన్నారు.

# "భారత రాజకీయాల్లో నవశకం
## : 2029 లక్ష్యంగా రాహుల్ గాంధీ విజయ్ మధ్య చారిత్రాత్మక సయోధ్య!"

- **రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మే 10:

భారతదేశ భవిష్యత్తును మార్చే దిశగా 2029 ఒక కీలక మలుపు కాబోతోంది. దేశంలో నెలకొన్న విభజన రాజకీయాలు, నిరుద్యోగం మరియు రాజ్యాంగ విలువల క్షీణతను అరికట్టడానికి రాహుల్ గాంధీ మరియు దళపతి విజయ్ మధ్య కుదిరిన సానుకూల ధోరణి ఒక కొత్త ఆశను చిగురింపజేస్తోంది.

గత కొన్నేళ్లుగా దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిళ్లు, సంస్థాగత అణచివేత మరియు సామాజిక విద్వేషాలకు వ్యతిరేకంగా ఈ కూటమి ఒక బలమైన గళంగా నిలవనుంది. యువత, సమాఖ్య స్ఫూర్తి, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా ఈ ప్రయాణం సాగనుంది.



### ఈ కలయిక యొక్క ప్రధాన ఉద్దేశాలు:

- **యువ నాయకత్వం:**

దేశంలోని యువత ఆకాంక్షలకు ప్రతిరూపంగా, వారి ఉపాధి మరియు విద్యావకాశాల కోసం పోరాడటం.

- **రాజ్యాంగ పరిరక్షణ:**

ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేస్తూ, ప్రతి పౌరుడి హక్కులను కాపాడటం.

- **సమ్మిళిత వృద్ధి:**

ద్వేషం మరియు భయం లేని సమాజాన్ని నిర్మిస్తూ, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం.

- **సమాఖ్య వ్యవస్థ:**

రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని గౌరవిస్తూ కేంద్రరాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడం.

ప్రస్తుత తరుణంలో భారతదేశానికి కావాల్సింది విభజన కాదు, ఐక్యత. ద్వేషపూరిత రాజకీయాల కంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య మరియు ఆర్థిక భరోసా ముఖ్యమని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాహుల్ గాంధీ మరియు విజయ్ ల మధ్య ఏర్పడే ఈ రాజకీయ సమీకరణం దేశానికి కొత్త ఊపిరి పోస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

"భయం లేని భారతం అభివృద్ధి పథంలో అడుగులు" అనే నినాదంతో 2029 ఎన్నికల నాటికి ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుకు తీసుకురావడమే ఈ కలయిక లక్ష్యం.



రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్

# ఐఏసీఈ చరిత్ర సృష్టించింది

- **గ్రాండ్ సక్సెస్ మీట్‌లో చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు**

సరూర్ నగర్, 9 మే (వెలుతురు ) :

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ఐఏసీఈ సంస్థ చరిత్ర సృష్టించిందని ఆ సంస్థ చైర్మన్ మైండ్ క్యాలిక్యులేషన్ వినయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సరూర్ నగర్‌లో నిర్వహించిన ఐఏసీఈ గ్రాండ్ సక్సెస్ మీట్-2026 కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఐఏసీఈ ఎస్ఎస్సీ సీజీఎల్-2025 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. వారికి బొకేలు, మెమెంటోలు, పారితోషకాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎస్ఎస్సీ సీజీఎల్‌పై అవగాహన చాలా తక్కువగా ఉండేదన్నారు. అలాంటి పరిస్థితుల్లో గత 12 సంవత్సరాలుగా తెలుగు విద్యార్థులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల వైపు నడిపిస్తూ ఐఏసీఈ అద్భుత ఫలితాలు సాధిస్తోందని తెలిపారు. సరైన మార్గదర్శకం, క్రమశిక్షణ, నాణ్యమైన శిక్షణతో విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు.డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యంగా 2025 సంవత్సరంలో ఆల్ ఇండియా 54, 59, 72, 120, 287, 324, 349 తదితర ర్యాంకులు సాధించి విద్యార్థులు ప్రతిభ చాటడంతో సంస్థ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. సౌత్ ఇండియాలో ఐఏసీఈ ప్రభంజనం సృష్టించిందని తెలిపారు.కోచింగ్ ద్వారానే అత్యధిక ప్రభుత్వ ఉద్యోగాలు సాధింపజేసిన సంస్థగా ఐఏసీఈ నిలిచిందన్నారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ క్యాంపస్ ఏర్పాటు చేసి అత్యుత్తమ శిక్షణ అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని చెప్పారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ స్థాయికి చేరుకున్నామని పేర్కొన్నారు.సంస్థలో చదివిన విద్యార్థులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే కాకుండా దేశవ్యాప్తంగా అనేక ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. వారి విజయాలను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది విద్యార్థులు ముందుకు వస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సైబరాబాద్ లో వీకెండ్–స్పెషల్ డ్రంక్ & డ్రైవ్.. 137 మందిపై కేసులు

సైబరాబాద్ వెలుతురు మే 10:

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ ADCP ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు.

ఈ డ్రైవ్‌లో భాగంగా137 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.113 ద్విచక్ర వాహనదారులు,05 ఆటోలు,18 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి.

బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే —105 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,18 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,14 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.

వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు.





మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది.

గత వారం (04.05.2026-09.05.2026) లో మొత్తం198 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో04 మందికి జరిమానా, జైలు శిక్ష,04 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,190 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# అక్షర విప్లవ వీరుడు మహాత్మా పూలే

హైదరాబాద్ వెలుతురు మే 10:

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో, నక్క వెంకటమ్మ యాదవ్ నక్క యాదగిరిస్వామి యా దవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ తెలంగాణ సాహిత్య అకాడమీ క్లాస్ మెంట్ క్లబ్ సౌజన్యంతోమహాత్మా జ్యోతిరావు పూలే ద్వి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో బీసీ కవిత బేరి సమావేశం ఆదివారం నాడు జరిగింది.

ఈ కార్యక్రమానికి సభ సమన్వయకర్తలు డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్,పి.బడే సాబ్ ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్ కృష్ణయ్య గారు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

సాహిత్య ప్రయోజనం కాలంతో పాటు మారుతూ వచ్చింది.

ఒకప్పుడు కవిత్వం అంటే కేవలం 'రసానందం' (సంతోషం) కోసమే అనే భావన ఉండేది.

ప్రకృతిని వర్ణించడం, అందాన్ని పొగడటం వరకే అది పరిమితమయ్యేది.

కానీ ఆధునిక కాలంలో సాహిత్యం ఒక సామాజిక ఆయుధంగా మారింది.

సాహిత్యం ఇప్పుడు కేవలం కాలక్షేపం కాదు, అది సమాజపు అంతరాత్మను తట్టి లేపే శక్తి. ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించి, వారిని చైతన్యవంతులను చేస్తుంది.

సమకాలీన సమస్యలైన అసమానతలు, అన్యాయాలు, అవినీతిపై సాహిత్యం నిలదీస్తుంది.

రచయిత తన కలం ద్వారా సమాజంలోని కుళ్లును కడిగిపారేయడానికి ప్రయత్నిస్తాడు.

చరిత్రను చూస్తే, పెద్ద పెద్ద విప్లవాల వెనుక కవుల మాటలు, రచయితల రచనలు ఉన్నాయి.

"కలం గొప్పదా? గళం గొప్పదా?" అంటే రెండూ కలిసి సమాజాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు.

ఒకప్పుడు సాహిత్యం పండితులకే పరిమితం, కానీ ఇప్పుడు అది సామాన్యుడి భాషలోకి వచ్చి, వాడి కష్టసుఖాలను ప్రతిబింబిస్తోంది.

క్లుప్తంగా చెప్పాలంటే... సంతోషం కోసం రాసేది కవిత్వం అయితే, సమాజ శ్రేయస్సు కోసం రాసేది సాహిత్యం. అది అద్దం లాంటిది సమాజం ఎలా ఉందో చూపిస్తుంది, సానపెట్టిన ఆయుధం లాంటిది సమాజాన్ని సరిదిద్దుతుంది.

సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలను, అన్యాయాలను మరియు అజ్ఞానాన్ని ఈ సాహిత్యమనే కత్తి ముక్కలు చేస్తుంది.

సామాన్యుడి గొంతు నొక్కేసే శక్తులపై, నిరంకుశత్వంపై కవిత్వం ఒక ఆయుధమై పోరాడుతుంది. అందుకే "కలం కత్తి కన్నా గొప్పది" అంటారు.

సాహిత్యం ద్వారా వచ్చే మార్పు తక్షణమే కనిపించకపోవచ్చు, కానీ అది సమాజపు పునాదుల్లో నిశ్శబ్దంగా ఒక "నిశ్శబ్ద విప్లవాన్ని" సృష్టిస్తుంది.

జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే వంటి వారి ఆలోచనలను నేటి తరం రచయితలు సాహిత్యం ద్వారా సామాన్యులకు చేరువ చేస్తున్నారు.

ఇది యువతలో విద్య పట్ల, హక్కుల పట్ల అవగాహన పెంచి, ఒక నిశ్శబ్ద సామాజిక మార్పుకు దారితీస్తోంది.

ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ..

సమాజంలో అత్యధిక నైపుణ్యం కలిగిన వర్గాల్లో బీసీలు (వెనుకబడిన తరగతులు) కీలక పాత్ర పోషిస్తున్నారు.

అస్తిత్వ వేదన మరియు ఆత్మగౌరవం అనేవి బీసీ (బహుజన) ఉద్యమాల్లో అత్యంత కీలకమైన అంశాలు

తమ కష్టానికి తగిన గుర్తింపు రానప్పుడు కలిగే ఆవేదన నుండి, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుకోవాలనే ఆత్మగౌరవ పోరాటం మొదలైంది.

అన్ని కుల సంఘాలు మరియు ఉప కులాలన్నీ తమ మధ్య ఉన్న భేదాలను పక్కన పెట్టి, ఒకే వేదికపైకి రావడం ద్వారానే 2029లో అధికారాన్ని కైవసం చేసుకోవచ్చని.

బీసీల రాజకీయ, సామాజిక చైతన్యం కోసం నిర్వహించే 'బీసీ కవిత భేరి' వంటి కార్యక్రమాలు పూలే ఆశయాలను చాటిచెప్పడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

తెలుగు సాహిత్య అకాడమీ, నక్క వెంకటమ్మ యాదవ్ మరియు యాదగిరి స్వామి యాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ మరియు క్లాస్మేట్స్ క్లబ్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, శాసనమండలి ఎల్ పి మధుసూదనాచారి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి చిరంజీవులు, బీసీ సమాజం అధ్యక్షులు సంఘం సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ పూర్వ డిజిపి పూర్ణచంద్రరావు, డాక్టర్ విజయ్ కుమార్, తెలుగు భాష చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ కల్లేష్, డాక్టర్ జయప్రకాష్, గురునాథం, డాక్టర్ వీరేష్, కవి సమ్మేళనం నిర్వహణ డాక్టర్ రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.








# కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలి : భీమ్ ఆర్మీ

నార్కట్ పల్లి వెలుతురు మే 10:



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని భీమ్ ఆర్మీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు మాట్లాడుతూ, 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి మొయినాబాద్ ఫామ్ హౌస్‌తో పాటు పలు ప్రాంతాల్లో అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు అత్యంత హేయమైనవని అన్నారు. బాధితురాలు మనస్తాపంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందంటే ఘటన ఎంత దారుణమో అర్థమవుతుందని పేర్కొన్నారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో గంటల తరబడి హైడ్రామా జరిగినప్పటికీ, బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తున్నా వెంటనే FIR నమోదు చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. "కేంద్ర మంత్రి కొడుకైతే చట్టానికి అతీతుడా? 'బేటీ బచావో' అని చెప్పే బీజేపీ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారు?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మరియు డీజీపీ ఈ ఘటనపై సమాధానం చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ మంత్రిని కాపాడేందుకు ప్రయత్నిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. చట్టం తన పని తాను చేసుకోకుండా అడ్డుకుంటున్న శక్తులు ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మహీంద్రా యూనివర్సిటీలో తోటి విద్యార్థిపై దాడి కేసులు, ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఉన్నప్పటికీ ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. కేంద్ర హోంశాఖలో కొనసాగుతూ విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని, లేని పక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయన్ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. "భార్య పుస్తెలు అమ్మి ఎన్నికల్లో పోటీ చేశానంటూ ప్రజల ముందు చెప్పే బండి సంజయ్, ఇప్పుడు తన కుమారుడు విలాసవంతంగా తిరగడానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలి" అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అలాగే కేసులో కఠినమైన సెక్షన్లు నమోదు చేయకుండా, తేలికపాటి సెక్షన్ల కింద కేసులు పెట్టి స్టేషన్ బెయిల్ వచ్చేలా చేశారని ఆరోపించారు. BNSS సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు 11, 12 కింద మాత్రమే కేసులు నమోదు చేయడం ద్వారా నిందితుడికి అనుకూలంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత, మైనార్టీ నాయకులు ఎస్కే జానీ, చింత విక్రమ్, చింత సునీల్, ముప్పిడి కుమార్, బోడ రాఖీ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి

- **పని ప్రదేశాలలో కూలీలకు కనీసం వసతులు కల్పించాలి**
- **---బొల్లు యాదగిరి (య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు )**

మోత్కూర్, మే 10,( వెలుతురు న్యూస్ ):



ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం రోజున మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ పిట్టల చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై ఆయన మాట్లాడుతూ.... యూపీఎ ప్రభుత్వంలో వామపక్షాల కృషితో ఏర్పడిన ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసెందుకు మోడీ ప్రభుత్వం 12 ఏళ్లుగా ఎన్నో కుట్రలు చేసిందని విమర్శించ్చారు. చట్టాన్ని పూర్తిగా రద్దుచేస్తే ప్రజలు తిరుగపడుతారని గ్రహించి బడ్జెట్లో నిధులను తగ్గిస్తూ బలహీన పరచి, చివరకు మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పేరు మార్చి జీ రాంజీ పేరుతో పథకంగా ప్రవేశ పెట్టిందని విమర్శించ్చారు. ఉపాధి హామీ చట్టానికి పాత పేరునే కొనసాగిస్తూ, బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులు విడుదలచేసి, ఎండా కాలంలో పని కూలీలకు కనీస వసతులు కల్పించాలని, రోజుకు 600 గౌరవ వేతనం ఇస్తూ, భూమిలేని నిరుపేదలకు ఏడాదికి 12 వేలు, సంవత్సరంలో 200 రోజులు పనికల్పించాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్, మత్స్య సంఘం నాయకులు వెండి యాదగిరి, చేనేత నాయకులు చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి,బీజేపీ ల చీకటి ఒప్పందాన్ని బయటపెట్టిన నరేంద్రమోడీ

- **-----మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి.**

మోత్కూర్, మే 10,(వెలుతురు న్యూస్ ):



బి ఆర్ ఎస్ చెప్పినవిదంగా బి. జె. పి, రేవంత్ రెడ్డి ల అసలు రంగు బయట పడిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ బీజేపీ మధ్యన ఎలాంటి ఒప్పందాలు లేకపోతే ప్రధానమంత్రి హోదాలో ఉండి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తిని మాతో కలవాలని ఎలా మాట్లాడుతారో తెలంగాణ ప్రజలు గమనించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలు ఒకటేనని, కెసిఆర్ ను ఓడించడానికి కాంగ్రెస్ బీజేపీ కలిసే పనిచేశాయని, పదవికోసం చివరకు రేవంత్ బీజేపీలో చేరడం ఖాయమన్నారు .పదవులకోసం ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న మోడీ పైసలతో పదవులు కొనుక్కున్న రేవంత్ ఇద్దరు చంద్రబాబు సూచన మేరకు పని చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేయాలని చూస్తున్నారని దీనిని తెలంగాణ ప్రజలు గుర్తించి వచ్చే ఎన్నికల్లో బీజేపీ కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# బహిరంగ సభకు భారీగా తరలిన బీజేపీ శ్రేణులు



గుండాల, మే 10 (వెలుతురు):

హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొననున్న భారీ బహిరంగ సభకు యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం నుంచి బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా భారీగా బయలుదేరాయి.

గుండాల మండల బీజేపీ అధ్యక్షుడు పింగళి విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు "భారత్ మాతా కి జై", "మోదీ జీ కి జై", "బీజేపీ జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహభరిత వాతావరణంలో ప్రయాణం కొనసాగించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషికి మద్దతుగా భారీ సంఖ్యలో సభకు హాజరవుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

అలాగే దేశాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని నాయకత్వం కీలకమని కొనియాడారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ మోర్చా, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.


# సాయి వంశీ గౌడ్ - మనీషా గౌడ్ లను ఆశీర్వదించిన సురిగి నరసింహా గౌడ్



హైదరాబాద్ వెలుతురు మే 10:
ఆదివారం రోజున కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీ వేముల గోపాల్ గౌడ్ గారి ఏకైక పుత్రుడు శ్రీ సాయి వంశీ గౌడ్@మనీషా గౌడ్ వివాహానికి గ వివాహం నాదర్గుల కల్వకోలు లక్ష్మీదేవి అమ్మ గార్డెన్లో జరిగే వివాహానికి హాజరై ఆశీర్వదించిన మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ ఈ కార్యక్రమంలో సిదగువుల నరసింహ నిరుడు కృష్ణ సురీగి శ్రవణ్ గౌడ్ సూరి వెంకటరమణ మునుకుంట్ల శ్రీను ఈరోజు కిషోర్ చారి మునుకుంట్ల నరసింహ సురిగి లింగస్వామి సురిగి స్వామి అయితే రాజు గణేష్ తదితరులు పాల్గొన్నారు

# సేవ చేయడానికే పుట్టిన నిజమైన సైనికుడు

మంచితనానికి మారుపేరు
ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడే అందరివాడు
సమాజం కోసం నిరంతరం కష్టపడే గొప్ప వ్యక్తిత్వం కలవారు
స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతో మందికి సహాయం చేస్తూ కష్టాల్లో ఉన్నవారి కళ్లలో ఆశ వెలిగిస్తున్న
సమాజానికి నిజమైన హీరో
ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది మీరే
ఎందుకంటే మీ హృదయం సేవతో నిండి ఉంది
మీరు చేసే ప్రతి మంచి పని ఎంతో మందికి ప్రేరణ.
మీ ఆలోచనలు నాయకత్వానికి నిదర్శనం
భవిష్యత్తులో ప్రజల మనసులు గెలుచుకునే గొప్ప లీడర్‌గా ఎదగాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.
మీ అడుగులు ఎప్పుడూ సేవ మార్గంలోనే ముందుకు సాగాలి
మీ పేరు మరెంతో మందికి ఆశగా మారాలి
దేవుడు మీకు ఆయురారోగ్యాలు, ఆనందం, మరింత శక్తి ఇవ్వాలి.
ఇలాంటి గొప్ప మనసున్న మీకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు.




# చలో పరేడ్ గ్రౌండ్‌కి తరలి వెళ్లిన బీజేపీ నాయకులు...




మోత్కూర్,మే 10,(వెలుతురు న్యూస్ ):

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తొలిసారి అభివృద్ధి కార్యక్రమాలకై హైదరాబాద్ విచ్చేస్తూ పెరేడ్ గ్రౌండ్లో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు మోత్కూర్ కి చెందిన బీజేపీ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీజేపీ మోత్కూర్ పట్టణ అధ్యక్షురాలు చాడ మంజులారెడ్డి, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్ రెడ్డి , పోచం సోమయ్య, పట్టణ ఉపాధ్యక్షులు కందుకూరి ప్రకాష్ ,ప్రధాన కార్యదర్శి జినకల దశరథ, అన్నెపు సత్యనారాయణ, ఎడ్ల రాము, సజ్జనం మనోహర్, కార్యదర్శి తీగల శ్రీధర్ గౌడ్ ,దేశబోయిన రమణ, గొడుగు చంద్రమౌళి, వంగాల శ్రీనివాస్, పురుగుల కృష్ణ, బద్దం మహేందర్ రెడ్డి, నల్ల మాసిరెడ్డి, దండ బోయిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీనివాస్ గౌడ్.



మోత్కూరు, మే 10 (వెలుతురు న్యూస్ ):

మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్_జ్యోతి దంపతుల కుమార్తె మాలిక వివాహం ఆదివారం స్థానిక మధుర మీనాక్షి ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ వివాహనికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బి.ఆర్.ఎస్.ఎస్ పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి,నాయకులు సురేష్ తదితరులు ఉన్నారు.

# మోడీ సభకు తరలిన పేట బిజెపి నాయకులు



వెలుతురు నారాయణఖేడ్ మే 10 :

మెదక్ జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గం లో శంకరంపేట్ హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద శంకరంపేట నుండి బిజెపి నాయకులు ఆదివారం ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లారు. మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. బి జె వై ఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు ధ్రువ. వెంకయ్య అంజయ్య మంగలి కృష్ణ సుకుమార్ శంకర్ రావు . ఆయా గ్రామాలనుండి బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు..

# ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం : మార్కెట్ డైరెక్టర్ మొహమ్మద్ జఫర్



- **బస్తి ఆడపడుచు వివాహానికి 21 వెయ్యిల నగదు, క్వింటల్ బియ్యం అందజేత....**
- **ఎన్నికల్లో గెలుపు అనంతరం 9 మంది ఆడపడుచు వివాహలకు కనుక అందజేసిన కౌన్సిలర్...**

జహీరాబాద్ వెలుతురు మే 10:

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని 100 శాతం అమలు చేస్తూనే వార్డును సమూలంగా అభివృద్ధి చేస్తామని కౌన్సిలర్ నయ్యర్ మొహమ్మద్ జాఫర్ అన్నారు. ఇటీవల జరిగిన పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోనీ శాంతి నగర్ లో భాగమైన 34 వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేసిన మొహమ్మద్ నయ్యర్ జఫర్ వార్డు వాసులకు ఎన్నికల్లో విజయం సాధిస్తే వార్డు ఆడపడుచు వివాహానికి కానుకగా క్వింటల్ బియ్యం, 20 వెయ్యిల నగదు సాయన్ని అందిస్తానని ఇచ్చిన మాటను విజయం సాధించిన తొమ్మిదవ రోజు నుంచే అమలు చేస్తూ ఔరా అనిపించుకొని మాటను నిలబెట్టుకోవడంపై వార్డు వాసులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక కౌన్సిలర్ ప్రతినిధి మొహమ్మద్ జాఫర్ కు కృతజతలు తెలుపుతున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఇప్పటివరకు 9 మంది లబ్ధిదారులకు క్వింటల్ బియ్యం, 20 వెయ్యిల రూపాయలు చొప్పున ఇచ్చి మాటను నిలుపుకున్నారు. ఈ సందర్భంగా మొహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీ చేస్తూ విజయం సాధించిన అనంతరం వార్డుకి చెందిన నిరుపేద ఆడపడుచుల వివాహానికి 20 వెయ్యిల నగదు సాయం, క్వింటల్ బియ్యం ఇస్తామని చెప్పడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారమే విజయం సాధించిన తదుపరి మాటను నీలుపూకున్నామని, రాబోయే ఐదు సం రాల పాటు ఇది కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మొహమ్మద్ నిసార్, మొహమ్మద్ ఆమెర్, కాలనీ వాసులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# 2003 డీఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి: తపస్

మెదక్ వెలుతురు మే 10:



మెదక్ పట్టణంలోని తపస్ జిల్లా కార్యాలయం లో తపస్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయులకు దేశవ్యాప్తంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (CPS) అమలులోకి వచ్చినప్పుడు, దానికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4 మరియు 57/5 ఉత్తర్వులు అత్యంత కీలకమైనవి అని,వీటి ప్రకారం సిపిఎస్ అమలుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలి ఆ ఉత్తర్వులు లో ఉంది అని,మన రాష్ట్రంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఈ ప్రయోజనాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం నిరాకరించడం సరైనది కాదు వారు అన్నారు. హైకోర్టు సానుకూల తీర్పునిస్తూ, మూడు నెలల్లో దీనిని అమలు చేయాలని ఆదేశించింది. అయితే, ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (SLP) దాఖలు చేయడం హాస్యాస్పదమని వారు అన్నారు. ముఖ్యంగా మే 5న జెఏసి (జేఏసీ) తో జరిగిన చర్చల రోజే ఈ రిట్ పిటిషన్ సుప్రీంకోర్టులో వేయడం ద్వారా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడం అని వారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్ధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మన్,తపస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, నర్సింలు, మెదక్, నార్సింగి మండలల అధ్యక్షులు నరేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హేమ రెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు విగ్రహ ప్రతిష్ఠాపన






- **ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

వెలుతురు నారాయణఖేడ్ మే 10 :

సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ నియోజకవర్గంలో కంగ్టి మండల కేంద్రంలో శివశరణి హేమ రెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు ఈరోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హేమ రెడ్డి మల్లమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం మరియు హేమ రెడ్డి మల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..
త్యాగానికి, భక్తికి నిలువుటద్దం శివశరణి హేమ రెడ్డి మల్లమ్మ అని కొనియాడారు. ఆమె జీవితం నేటి సమాజానికి ఆదర్శప్రాయమని, ప్రతి ఒక్కరూ ఆమె చూపిన ధర్మ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం లో ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మండల కేంద్రంలో భక్తిభావం ఉట్టిపడేలా విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం అభినందనీయమని నిర్వాహకులను ఉద్దేశించి అన్నారు."
అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు,వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు,మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి... కరపత్రాలు పంచి





- **హిందూ ఏక్తా యాత్రకు ఆహ్వానిస్తున్న కాషాయ శ్రేణులు**
- **రేపు జరగబోయే హిందూ ఏక్తా యాత్రకు చకచకా ఏర్పాట్లు**
- **గతం కంటే ఘనంగా జోష్ నింపుందుకు సిద్ధమైన కేంద్ర మంత్రి బండి సంజయ్**
- **వినూత్న రీతిలో కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకోనున్న ఏక్తా యాత్ర**
- **పిల్లాపాపలతో ఏక్తా యాత్ర ర్యాలీని చూసేలా ఏర్పాట్లు చేస్తున్న కాషాయ దళం**
- **ఒక్కడితో మొదలై.... హిందువులంతా సంఘటితమై....**
- **16 ఏళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతున్న హిందూ ఏక్తా యాత్ర**

కరీంనగర్ వెలుతురు మే 10:

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. హిందువులందరినీ సంఘటితం చేయడమే లక్ష్యంగా ప్రతి ఏటా బాల గంగాధర్ తిలక్ గణేశ్ ఉత్సవాలను ప్రారంభించిన సంగతి తెలిసిదే. అదే స్ఫూర్తితో హిందువులందరినీ రాజకీయాలకు అతీతంగా సంఘటితం చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 16 ఏళ్ల క్రితం బండి సంజయ్ కుమార్ గుప్పెడు మందితో కరీంనగర్ లో ''హిందూ ఏక్తా యాత్ర''ను ప్రారంభించారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా గుప్పెడు మంది నుండి వందలుగా, వేలుగా హిందువులంతా తరలి వచ్చి హిందూ ఏక్తా యాత్రలో పాల్గొంటున్నారు. ప్రతి ఏటా హిందూ ఏక్తా యాత్రకు వచ్చే హిందువుల సంఖ్య పెరుగుతూనే ఉంది. గత ఏడాది సైతం భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈసారి అంతకు మించి ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**గతంకంటే మిన్నగా...**

గతానికి భిన్నంగా ఈసారి 'హిందూ ఏక్తా యాత్ర'కు రావాలంటూ కాషాయ శ్రేణులు, కార్పొరేటర్లు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. కాషాయ శ్రేణులు తమ తమ డివిజన్లలోని, కాలనీల్లోని గోడలపై 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలి రావాలంటూ స్వయంగా వాల్ పెయింటింగ్ రాశారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

**వేసవిలో ఇబ్బంది లేకుండా....**

బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ లోని వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ఏక్తా యాత్ర కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనం ఉత్సాహం చూపుతుండటంతో వారికి ప్రత్యేకంగా రవాణా సదుపాయం కల్పించేందుకు కాషాయ శ్రేణులు సిద్ధమయ్యాయి. మరోవైపు ఎండాకాలం కావడంతో ఏక్తా యాత్రలో పాల్గొనే వారికి కాషాయ శ్రేణులు, హిందుత్వ వాదులు, వ్యాపారులు స్వచ్ఛందంగా మంచినీళ్లు, మజ్జిగ, ఇతర ఆహార పానియాలను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ ఏక్తా యాత్ర

**ఆరంభమయ్యేది ఇలా...**

కరీంనగర్ లోని వైశ్య భవన్ నుండి 12న సాయంత్రం 4 గంటలకు హిందూ ఏక్తా యాత్ర ర్యాలీ ప్రారంభం కానుంది. ర్యాలీ ఆరంభంలోనే వైశ్యాభవన్ వద్ద హిందుత్వ వాదులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగిస్తారు. అనంతరం వైశ్యా భవన్ నుండి ప్రారంభమయ్యే ర్యాలీ రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్ , వన్ టౌన్, వెంకటేశ్వర టెంపుల్, అమరవీరుల స్థూపం, జయశంకర్ సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వైశ్య భవన్ కు చేరుకుంటుంది. ఇక్కడే హిందూ ఏక్తా యాత్రను ముగిస్తారు. ఈ యాత్రకు కులాలను పక్కన పెట్టి హిందువులంతా రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల కార్యకర్తలంతా ఈ యాత్రకు హాజరవుతుండటం విశేషం. ముఖ్యంగా వివిధ కుల సంఘాల నాయకులంతా సంఘీభావం తెలిపారు. వీరితోపాటు వివిధ వృత్తి సంఘాలు, ధార్మిక సంస్థలు, కళాకారులు, కార్మిక సంఘాల నాయకులు ఈ యాత్రలో పాల్గొనబోతోన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ

**ఆకట్టుకోనున్న కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు**

దాదాపు 6 గంటలపాటు కొనసాగే హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనే హిందుత్వ వాదులు, కరీంనగర్ పట్టణ ప్రజలను ఆకట్టుకునేలా వివిధ రూపాల్లో కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే కేరళ నుండి హనుమంతుడు, హైదరాబాద్ నుండి శ్రీరాముడి విగ్రహాలను కరీంనగర్ కు తరలిస్తున్నారు. ఢిల్లీ నుండి ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకునే కళాకారులను రప్పిస్తున్నారు. కేరళ నుండి డప్పు వాయిద్య కళాకారులు వస్తున్నారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నుండి ప్రతి ఏటా ధ్వజాలు రాబోతున్నాయి.

**జోష్ నింపేందుకు సిద్ధమైన కేంద్ర మంత్రి**

గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో ప్రజల్లో అయోమయం నెలకొన్న నేపథ్యంలో ''హిందూ ఏక్తా యాత్ర'' సందర్భంగా వాటన్నింటినీ పటా పంచలు చేస్తూ హిందుత్వ వాదుల్లో జోష్ నింపేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సిద్ధమయ్యారు. ముఖ్యతో తనతోపాటు రాష్ట్రంలోని అనేక మంది హిందుత్వ వాదులపైనా, కుటుంబ సభ్యులపైనా లౌకిక వాద ముసుగులో కొనసాగుతున్న దాడులను ఎండగడుతూ హిందుత్వ వాదులందిరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే లక్షంగా హిందూ ఏక్తా యాత్రను కొనసాగించనున్నారు.

# ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు...

- **పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు.. శాసనసభలో చర్చ తర్వాతే నిర్ణయం**



**హైదరాబాద్, మే 10 (వెలుతురు):**

ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్నంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# NHAI ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో భేటీ అయిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- **రాష్ట్రంలోని పలు NHAI ప్రాజెక్ట్స్ పై చర్చించిన మంత్రి**

హైదరాబాద్ వెలుతురు మే 10:

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు ఆదివారం హైదరాబాద్ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ (NH65) విస్తరణ పనులు ప్రారంభం పై ప్రత్యేకంగా చర్చించారు. నిత్యం యాక్సిడెంట్స్ తో డెత్ రోడ్ గా పిలువబడుతున్న హైదరాబాద్ విజయవాడ రహదారి 8లేన్ విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని కోరారు. ఇదే రహదారిలో ఎల్బీనగర్ నుండి



హయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, డీపీఆర్ MoRTH కు పంపిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్ విజయవాడ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు NHAI ఛైర్మన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో NHAI ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న,చేపట్టబోయే పలు ప్రాజెక్టుల అంశాలు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ప్రాజెక్టులు త్వరగా పూర్తయేలా చూడాలని NHAI ఛైర్మన్ ను మంత్రి కోరారు. మంత్రి వెంట రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య,NHAI రీజినల్ ఆఫీసర్ శివ శంకర్,ఆర్ అండ్ బి సి.ఈ లు ధర్మారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవంగా రైతు వారోత్సవాలు

- **రైతు సంక్షేమం - ఆధునిక వ్యవసాయ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్ వెలుతురు మే 10:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "రైతు వారం" కార్యక్రమాలు ఘన విజయవంతంగా ముగిశాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

**నేల ఆరోగ్యం - శాస్త్రీయ సాగుకు తొలి అడుగు**

మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్రవ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

**ధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం**

మే 5న హనుమకొండలో గౌరవ మంత్రులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు శ్రీమతి కొండ సురేఖ గారి ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

**రైతుకు ఆర్థిక భరోసా – మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి**

మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర (MSP), మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు.

**యాంత్రీకరణ - సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన**

మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. 45,901 మంది రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న శ్రీ వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వారికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మాత్యులతో పాటుగా మంత్రులు



శ్రీమతి కొండా సురేఖ ఎంపీ కావ్య శాసనసభ్యులు శ్రీహరి వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్ ఐ.ఏ.ఎస్, శ్రీ డా.బి. గోపి ఐ.ఏ.ఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం**

రైతు వారం ఐదవ రోజున పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 593 కృత్రిమ గర్భధారణ క్యాంపులు నిర్వహించి, 35,336 పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అదేవిధంగా 2,654 మంది రైతులకు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్ర నీటి వినియోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికపై వివరించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మత్తులు, చెరువుల పూడికతీత పనులు వేగవంతం చేయడంపై అవగాహన కల్పించారు. చెరువుల గట్లపై పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గుర్రపుడెక్క తొలగింపు మరియు కాలువల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యత వివరించారు. చెరువుల నల్లమట్టి వినియోగం వల్ల నేల సారవంతం పెరుగుతుందని రైతులకు తెలియజేశారు. మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ రైతు వారోత్సవ కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ అవగాహన ఆధునిక సాంకేతిక ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతున్నాయి రైతు సంక్షేమం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుంది డా.బి. గోపి, ఐఏఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ హైదరాబాద్ తెలంగాణ.

# సీఎం చంద్రబాబు ఢిల్లీ టూర్ ఖరారు

- **అమిత్ షా, ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో భేటీలు**
- **నేడు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఉదయం కీలక భేటీ**



అమరావతి వెలుతురు మే 10:

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. రేపు ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి ఢిల్లీ చేరుకునే సీఎం, అక్కడ కేంద్ర మంత్రులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన భద్రత, అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులపై చర్చ జరిగే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమవుతారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు, సాగునీటి పథకాలు, నదీ అనుసంధాన ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక సహకారం, సాంకేతిక సహాయం అంశాలపై చర్చ జరగనుంది. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే బిజినెస్ సమ్మిట్‌కు చంద్రబాబు హాజరవుతారు. పరిశ్రమల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ అవకాశాల సృష్టిపై ఆయన ప్రసంగించే అవకాశం ఉంది. అదే రోజు సాయంత్రం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్రదేవ్‌తో పాటు నీతి ఆయోగ్ సభ్యులతో కూడా ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. పర్యటనలో భాగంగా చంద్రబాబు సోమవారం రాత్రి ఢిల్లీలోనే బస చేయనున్నారు. ఈ వరుస భేటీలు రాష్ట్రానికి కేంద్ర సహకారం పెంచడం, పెట్టుబడులు ఆకర్షించడం, అభివృద్ధి ప్రాజెక్టులకు వేగం తీసుకురావడమే లక్ష్యంగా సాగనున్నాయి.

# తమిళనాడు గవర్నర్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించలేదా.?

- **పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్**

అమరావతి వెలుతురు మే 10:

ప్రజాస్వామ్యంలో రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని ఈ పార్టీ అన్న ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఆ పార్టీకి గాని కూటమికి గాని సగం కన్నా ఎక్కువ స్థానాలు ఉండటం తప్పనిసరి. ఈ మ్యాజిక్ ఫిగర్ వచ్చిన పార్టీలు గాని కూటములు గాని వారి అధినేతని ఎన్నుకుంటారు రాష్ట్రపతి ఆ అధినేతని ప్రధానమంత్రి గాను గవర్నర్ ఆ అధినేతని ముఖ్యమంత్రిగాను ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఇటీవల దేశంలో ముగిసిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్ అస్సాం కేరళ పుదుచ్చేరి లలో ఆయా రాష్ట్ర ప్రజలు స్పష్టమైన తీర్పుని ఇచ్చి వారికి నచ్చిన పార్టీలకు సగం కన్నా ఎక్కువ సీట్లు ఇచ్చారు అంటే స్పష్టమైన తీర్పు ప్రజలు ఇచ్చారు. కానీ తమిళనాడు విషయంలో ఆ రాష్ట్ర ప్రజలు సగం కన్నా ఎక్కువ సీట్లు ఏ పార్టీకి ఇవ్వలేదు అంటే ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. టీవీకే పార్టీ అధినేత జోసఫ్ విజయ్ గారు మిగతా పార్టీల కన్నా ఎక్కువ స్థానాలు సంపాదించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కావలసిన కనీస సంఖ్య 118. ఆయన గెలిచిన స్థానాలు 108, ఇందులోనూ ఆయన రెండు చోట్ల గెలిచారు కాబట్టి 107 స్థానాలు గానే పరిగణించాలి. అంటే ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి మరో 11 సీట్లు కావాలి. తమిళ ప్రజలు ఇచ్చిన అస్పష్ట తీర్పు కారణంగా జోసఫ్ విజయ్ గారి ప్రభుత్వం వెంటనే ఏర్పాటు కాలేదు ఇది మనం మొదటిగా గుర్తించాలి. ఏ పార్టీకి స్పష్టంగా ప్రభుత్వ ఏర్పాటుకు మ్యాజిక్ ఫిగర్ లేనప్పుడు ఆ రాష్ట్ర గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటు కి ఏ రకంగా ముందుకెళ్లాలి అన్న మార్గదర్శకాలు సర్కారియా కమిషన్ గతంలోని ఇచ్చి ఉన్నది.

**మొదటి ఆప్షన్:**

ఎన్నికలకు ముందు కొన్ని పార్టీలు కూటమిగా ఏర్పడినట్లయితే ఆ కూటమికి ప్రభుత్వం ఏర్పాటుకి సగం కన్నా ఎక్కువ స్థానాలు ఉన్నట్లయితే మొదట ఈ కూటమి గవర్నర్ పిలవాలి.

**రెండవ ఆప్షన్:**

ఆ రాష్ట్ర ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సంపాదించిన పార్టీని గవర్నర్ గారు ఆహ్వానించి ప్రభుత్వం ఏర్పాటు చేయగలరా మ్యాజిక్ ఫిగర్ పొందగలరా అని గవర్నర్ పిలిచి అడగాలి.

**మూడో ఆప్షన్:**



ఎన్నికల అనంతరం కొన్ని పార్టీలు కూటమిగా ఏర్పడి మా దగ్గర సగం కన్నా ఎక్కువ స్థానాలు ఉన్నాయని చెప్పగలిగితే వారిని ఆహ్వానించి ప్రభుత్వం ఏర్పాటు చేయగలరా అని గవర్నర్ అడగాలి. అయితే జోసఫ్ విజయ్ గారు చేసింది ఏంటి అంటే గవర్నర్ గారి పిలుపు కోసం వేచి చూడకుండా తనంతట తానుగా గవర్నర్ గారి దగ్గరికి వెళ్లి నాకు కాంగ్రెస్ మద్దతు ఉంది నా దగ్గర 112 మంది ఎమ్మెల్యేల సంతకాలు ఉన్నాయి నాకు ప్రభుత్వం ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వండి అని అడిగారు. అంటే జోసఫ్ విజయ్ గారు రెండవ ఆప్షన్ కోసం వేచి చూడకుండా నేరుగా మూడవ ఆప్షన్ లోకి తనంతట తానుగా వెళ్ళిపోయారు. గవర్నర్ గారి దగ్గర ఎప్పుడైతే జోసఫ్ విజయ్ గారు కాంగ్రెస్ మద్దతుతో వెళ్లి మూడవ ఆప్షన్ ప్రకారం అవకాశం ఇమ్మన్నారు. గవర్నర్ గారు తప్పనిసరిగా మీకు సగం కన్నా ఎక్కువ స్థానాలు ఉండాలి ఆయా పార్టీలు ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి మిగతా ఆరుగురు సభ్యుల మద్దతు తీసుకొని రండి అనటం తప్ప గవర్నర్ గారు చేసేది ఏమీ లేని పరిస్థితి. ఇది కేవలం జోసఫ్ విజయ్ గారు కోరి తెచ్చుకున్న పరిస్థితి ఎంచుకున్న ఆప్షన్. ఎప్పుడైతే గవర్నర్ గారు మూడవ ఆప్షన్ ప్రకారం మిగతా ఆరుగుర ఎమ్మెల్యేల మద్దతు లేఖ తెమ్మన్నారో గవర్నర్ గారిపై భారతీయ జనతా పార్టీపై నిష్కారణంగా విషం చిమ్మటం మొదలుపెట్టేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మే ఐదో తారీకునే జోసఫ్ విజయ్ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమిళనాడు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండలుగా ఉంటుందని భరోసా ఇచ్చారు దానికి జోసఫ్ విజయ్ గారు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ తమిళనాడు శాఖ బిజెపి దగ్గర ఒక ఎమ్మెల్యే మాత్రమే ఉన్నారని మేము ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల పరిస్థితుల్లో తటస్థంగా అన్నిటికీ దూరంగా ఉంటామని ప్రకటన కూడా విడుదల చేశారు. ఇంత పారదర్శకంగా బిజెపి మరియు కేంద్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ గవర్నర్ గారిని కేంద్ర ప్రభుత్వం ఆడిస్తోందని బిజెపి కుట్రలు చేస్తుందని మాపై కాంగ్రెస్ కమ్యూనిస్టులు ఓ వర్గం మీడియా అనవసరమైన దుష్ప్రచారాలు చేయటం నిజంగా బాధాకరం. తమిళనాడు కి ఇంచార్జ్ గవర్నర్గా కేరళ గవర్నర్గా వ్యవహరిస్తున్న శ్రీ రాజేంద్ర ఆర్లేఖర్ గారు దేశ రాజకీయాలలో నాలుగు దశాబ్దాలుగా నిజాయితీగా పనిచేస్తున్న ఒక దళిత మేధావి. ఆయన గోవా రాష్ట్ర శాసనసభ స్పీకర్ గా, ఆ రాష్ట్ర మంత్రిగా, వివిధ రాష్ట్రాల గవర్నర్గా, ఇందిరా గాంధీ గారు విధించిన ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం కూడా అనుభవించినటువంటి దేశభక్తుడు. అటువంటి నిస్వార్ధపరుడైన వ్యక్తి మీద అనవసరమైన అబండాలు వేశారు ఆ సందర్భంలో ఆయన ప్రోటోకాల్ ని పక్కకు పెట్టి ఒక జాతీయ మీడియాకు వచ్చి ఉన్న విషయాలు దేశ ప్రజల ముందు ఉంచి తన సచీలతని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జోసఫ్ విజయ్ గారు తనకు తానుగా మూడవ ఆప్షన్ ని ఎంచుకున్నారు ఆ పరిస్థితుల్లో గవర్నర్ గారు జోసఫ్ విజయ్ గారికి సగం కన్నా ఎక్కువ స్థానాలు ఉన్నాయో లేదో లిఖితపూర్వకంగా పేపర్ పైన ఆయా పార్టీల మద్దతు లేఖలు తీసుకురండి అని చెప్పక తప్పని పరిస్థితి. అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సివికె, ఐయూఎంఎల్ పార్టీలు తమ మద్దతు జోసఫ్ విజయ్ గారి పార్టీ టీవీకేకే లేఖలు ఇచ్చారు గవర్నర్ గారు మరుక్షణమే జోసఫ్ విజయ్ గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి సమయం కేటాయించారు, ప్రమాణ స్వీకారం చేయించారు. గవర్నర్ వ్యవస్థలను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా 100 కన్నా ఎక్కువసార్లు ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలని ఆర్టికల్ 356 ఉపయోగించి రాష్ట్రపతి పాలన పెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర వాళ్లది. అటువంటి కళంక చరిత్ర ఉన్న కాంగ్రెస్ వాళ్లు వారికి వత్తాసు పలికే కమ్యూనిస్టులు ఒక వర్గ మీడియా ఏనాడూ రాష్ట్రపతి పాలన పెట్టని ప్రధానమంత్రి నరేంద్ర మోడి గారిపై అసత్య ఆరోపణలు చేసి దురుద్దేశాలు అంటగట్టే ప్రయత్నం చేయటం సిగ్గుచేటు. ఎంతో హుందాగా రాజ్యాంగబద్ధంగా వివరించిన తమిళనాడు ఇన్చార్జి గవర్నర్ శ్రీ రాజేంద్ర ఆర్లేకర్ గారికి అభినందనలు.

# తెలంగాణ అభివృద్ధికి 12 లక్షల కోట్లు ఇచ్చాం

- **ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు ఏమయ్యాయి?**
- **5 వందేభారత్ రైళ్లు, 42 స్టేషన్ల అభివృద్ధి కేంద్రం కృషేనని వ్యాఖ్య**



హైదరాబాద్ వెలుతురు మే 10:

తెలంగాణ అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పుడు ప్రజల ముందుకు రావడం లేదన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువత కోసం ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజలను అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని, గతంలోనూ ఇదే విధానాన్ని అనుసరించిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధిలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాత్ర ఎంతో కీలకమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత 11 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం దాదాపు రూ.12 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం మాత్రమే రూ.1.85 లక్షల కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల విస్తరణ, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్లైఓవర్లు, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పనులు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైల్వే రంగంలోనూ తెలంగాణకు కేంద్రం పెద్దపీట వేసిందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి ఐదు వందేభారత్ రైళ్లు కేటాయించామని, 42 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులను కూడా తెలంగాణకు అనుసంధానం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ప్రజలకు తెలియనీయకుండా చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అమలవుతున్న సన్నబియ్యం పథకానికి కూడా కేంద్ర ప్రభుత్వమే 80 శాతం నిధులు ఇస్తోందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పకుండా తమకే క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. "ఇవన్నీ రాహుల్ గాంధీ ఇచ్చారా? లేక కేసీఆర్ తెచ్చారా? ఇది మోదీ ప్రభుత్వ నిబద్ధత కాదా?" అంటూ సభలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కూడా కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు. ముఖ్యంగా ముస్లింల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజంలో విభజన రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపిందని మండిపడ్డారు. 'SIR' పేరుతో ప్రభుత్వం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి మత రాజకీయాలపై దృష్టి పెట్టడం కాంగ్రెస్ అసలు స్వరూపమని విమర్శించారు. గతంలో పదేళ్ల పాటు తెలంగాణ ఒకే కుటుంబ పాలనలో నలిగిపోయిందని, ఇప్పుడు గాంధీ కుటుంబం ఆధీనంలోకి వెళ్లిపోయిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు బీఆర్‌ఎస్ కుటుంబ పాలనతో రాష్ట్రం నష్టపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలకే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం బీజేపీ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తుందని, కానీ బీజేపీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో వరుసగా మూడుసార్లు బీజేపీ అధికారంలోకి రావడానికి ఇదే ప్రధాన కారణమని తెలిపారు.

# "మా జనాభాకు తగ్గ హక్కులు ఎక్కడ?"

## న్యాయం కోసం ఎదురు చూస్తున్న ఓబీసీ భారతం

భారత రాజకీయాల్లో సామాజిక న్యాయం అనే పదం కేవలం ఒక నినాదం కాదు. అది కోట్లాది అణగారిన వర్గాల చరిత్ర, పోరాటం, ఆవేదన, ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల ప్రతిబింబం. ముఖ్యంగా ఇతర వెనుకబడిన వర్గాలు, అంటే ఓబీసీలు లేదా బీసీలు, భారత సామాజిక నిర్మాణంలో అత్యంత పెద్ద వర్గం అయినప్పటికీ, అధికార నిర్మాణాల్లో, విధాన నిర్ణయాల్లో, సంపద పంపిణీలో, విద్యా అవకాశాల్లో, ఉద్యోగాల్లో, రాజకీయ ప్రతినిధిత్వంలో ఇప్పటికీ తమ జనాభా నిష్పత్తికి తగిన స్థానం పొందలేదనే భావన బలంగా ఉంది. ఈ నేపథ్యంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తాను ఓబీసీ వర్గానికి చెందిన నాయకుడిగా చెప్పుకుంటూ వచ్చిన పదకొండు సంవత్సరాల పాలన తర్వాత కూడా బీసీ సమాజం ఎదుర్కొంటున్న ప్రశ్నలు మరింత పదునెక్కుతున్నాయి.ఒకప్పుడు సామాజిక న్యాయం అనే భావన ప్రధానంగా ఉత్తర భారత రాజకీయాల్లో మండల్ ఉద్యమంతో బలపడితే, ఇప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణలో, బీసీ రాజకీయ చైతన్యం కొత్త దశలోకి అడుగుపెడుతోంది. తెలంగాణలో బీసీ వర్గాలు కేవలం ఓటు బ్యాంక్ కాదు, అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, సంప్రదాయ వృత్తులకు, గ్రామీణ జీవనానికి, సామాజిక నిర్మాణానికి వెన్నెముక. అలాంటి వర్గాల నుంచి వస్తున్న ప్రశ్నలు కేవలం రాజకీయ విమర్శలుగా చూడలేం. అవి రాజ్యాంగ హామీల అమలుపై నిలదీతలు.నరేంద్ర మోడీ ప్రభుత్వం తనను సామాజిక న్యాయ పరిరక్షకుడిగా చిత్రీకరించుకునే ప్రయత్నం చేసింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి "సబ్కా సాథ్, సబ్కా వికాస్" అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. బీసీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఉన్నత పదవుల్లోకి వచ్చారని, దేశ రాజకీయాల్లో కొత్త సామాజిక సమీకరణాన్ని తీసుకువచ్చామని ప్రచారం చేసింది. కానీ ప్రశ్న ఇక్కడే మొదలవుతోంది. ఒక బీసీ నాయకుడు అధికారంలో ఉండటం వల్ల బీసీ సమాజం మొత్తం శక్తివంతమైందా? లేక బీసీ అనే గుర్తింపును రాజకీయ ప్రచారానికి మాత్రమే వినియోగించారా?

మండల్ కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలుకాలేదనే ప్రశ్న ఇప్పటికీ భారత రాజకీయాల కేంద్ర బిందువుగానే ఉంది. 1979లో ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ భారత దేశంలోని సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు సిఫార్సు చేసింది. 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వం ఆ సిఫార్సులను అమలు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కానీ అప్పటి నుంచి మూడు దశాబ్దాలు గడిచినా మండల్ ఆత్మ పూర్తిగా అమలుకాలేదు. కేంద్ర ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నా, ప్రైవేట్ రంగంలో లేవు. న్యాయవ్యవస్థలో లేవు. ఉన్నత విద్యా సంస్థల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ప్రమోషన్లలో స్పష్టత లేదు. అనేక ఓబీసీ కులాలు ఇప్పటికీ సరైన ప్రాతినిధ్యం పొందడం లేదు.

ఈ పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం నిజంగా మండల్ ఆత్మను ముందుకు తీసుకెళ్లిందా? లేక మండల్ రాజకీయాలను కేవలం ఎన్నికల గణితంగా మార్చిందా? అనే ప్రశ్న సహజంగానే వస్తోంది.

బీసీ సమాజంలో అత్యంత పెద్ద డిమాండ్ కులగణన. ఎందుకంటే జనాభా ఎంత ఉందో తెలియకుండా హక్కుల పంపిణీ ఎలా సాధ్యం అవుతుంది? స్వతంత్ర భారతదేశంలో 1931 తర్వాత పూర్తి స్థాయి కులగణన జరగలేదు. అప్పటి గణాంకాలనే ఇప్పటికీ విధానాల పునాదిగా ఉపయోగించడం ఒక పెద్ద విరోధాభాసం. దేశంలో ఓబీసీలు ఎంతమంది ఉన్నారు? ఏ వర్గం ఎంత వెనుకబడి ఉంది? విద్య, ఉద్యోగాలు, ఆదాయం, భూమి పంపిణీలో వారి స్థితి ఏమిటి? ఇవన్నీ ఖచ్చితంగా తెలియకుండా సమాన న్యాయం ఎలా అందుతుంది? 2025 ఏప్రిల్ 1న కేంద్ర కేబినెట్ జాతీయ జనగణనలో భాగంగా సమగ్ర కులగణన చేపడతామని ప్రకటించినప్పుడు బీసీ సమాజంలో ఆశలు పెరిగాయి. దేశవ్యాప్తంగా అది ఒక చారిత్రాత్మక అడుగుగా భావించబడింది. కానీ ఆ తర్వాత పరిస్థితులు మారలేదు. 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన గృహ లెక్కింపులో మొదటి దశలో ఓబీసీ కుటుంబాల ప్రత్యేక గణన లేకపోవడం అనేక అనుమానాలకు దారితీసింది. కులగణన నిజంగా జరుగుతుందా? లేక అది మరోసారి రాజకీయ ప్రకటనగానే మిగిలిపోతుందా? అనే సందేహం బలపడింది. కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడేవారు దేశాన్ని మళ్లీ కులాలుగా విభజిస్తుందని అంటున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే భారత సమాజం ఇప్పటికీ కులాల ఆధారంగానే సామాజిక, ఆర్థిక అవకాశాలను పంచుకుంటోంది. ఉద్యోగం కోసం, వివాహం కోసం, రాజకీయ టికెట్ కోసం, గ్రామీణ సామాజిక సంబంధాల కోసం, వృత్తుల కోసం కులం ఇప్పటికీ ప్రభావవంతమైన అంశమే. అలాంటప్పుడు కుల వాస్తవాలను లెక్కించడం తప్పా? లేక అసమానతలను దాచిపెట్టడమే తప్పా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

బీసీ మహిళల విషయంలో పరిస్థితి ఇంకా క్లిష్టంగా ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయంగా ప్రచారం చేసింది. పార్లమెంట్ మరియు శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడం స్త్రీ సాధికారతకు ఒక అడుగని పేర్కొంది. కానీ అందులో ఓబీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడం తీవ్రమైన విమర్శలకు దారితీసింది. ఎందుకంటే సామాజికంగా వెనుకబడిన మహిళలు మరియు ఆధిపత్య వర్గాలకు చెందిన మహిళల మధ్య పరిస్థితులు సమానంగా లేవు. ఒక అగ్రవర్ణ మహిళకు ఉన్న విద్యా, ఆర్థిక, సామాజిక అవకాశాలు గ్రామీణ బీసీ మహిళకు ఉండవు.ఈ నేపథ్యంలో ఉపకోటా లేకుండా మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే అసలు ప్రయోజనం సామాజికంగా బలమైన వర్గాలకే వెళ్లిపోతుందనే ఆందోళన బీసీ సంఘాల్లో వ్యక్తమవుతోంది. ఇది కేవలం రాజకీయ వాదన కాదు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా రిజర్వేషన్ల పంపిణీపై ఇలాంటి చర్చలు జరిగాయి. సామాజిక న్యాయం




అంటే అందరికీ ఒకే మోతాదు కాదు, అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించడం.తెలంగాణ రాష్ట్రం ఈ విషయంలో దేశ దృష్టిని ఆకర్షించే నిర్ణయం తీసుకుంది. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేలా రాష్ట్ర అసెంబ్లీ బిల్లును ఆమోదించింది. రాష్ట్రంలో బీసీల జనాభా అధికమని, వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉందని పేర్కొంటూ ఈ నిర్ణయం తీసుకుంది. కానీ ఏడాది గడిచినా కేంద్ర ప్రభుత్వం దానిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం తెలంగాణలో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. ప్రశ్న సూటిగా ఉంది. ఒకవైపు బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఎందుకు వెనుకంజ వేస్తోంది? రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును ఎందుకు నిలిపివేస్తోంది? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిందే.రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితి కూడా మరో ప్రధాన అంశం. ఇంద్ర సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు విధించిన ఈ పరిమితి అనేక రాష్ట్రాల్లో సామాజిక న్యాయ అమలుకు అడ్డంకిగా మారింది. తమిళనాడు లాంటి రాష్ట్రాలు ప్రత్యేక చట్టాలతో దానిని అధిగమించగా, మరికొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ అదే గోడను ఢీకొంటున్నాయి. దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జనాభా కలిపి భారీ శాతంలో ఉన్నప్పుడు 50 శాతం పరిమితి ఎలా న్యాయసమ్మతం అవుతుందని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించింది. అంటే రాజ్యాంగ సవరణల ద్వారా కొత్త రిజర్వేషన్లు ఇవ్వగల సామర్థ్యం ప్రభుత్వానికి ఉందని ఇది చూపించింది. అయితే ఓబీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంచే విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తోంది? అనే ప్రశ్న మరింత బలపడింది.బీసీల కోసం ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా కొత్తది కాదు. దేశంలో వ్యవసాయం, గిరిజన సంక్షేమం, మైనారిటీ వ్యవహారాలు, మహిళా శిశు సంక్షేమం వంటి అనేక రంగాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. కానీ జనాభాలో అతిపెద్ద వర్గమైన ఓబీసీల కోసం ప్రత్యేకంగా సమగ్ర విధానాలు రూపొందించే శక్తివంతమైన మంత్రిత్వ శాఖ ఇంకా లేదు. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఓబీసీ అంశాలు పరిమితమైపోతున్నాయి.

ఇది కేవలం పరిపాలనా అంశం కాదు. విధాన ప్రాధాన్యతకు సూచిక. ఒక వర్గం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండటం అంటే ఆ వర్గ సమస్యలు ప్రభుత్వ దృష్టిలో ప్రత్యేక స్థానం పొందినట్టే. అలాంటప్పుడు పదకొండు సంవత్సరాల పాలనలో కూడా ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖ ఎందుకు ఏర్పాటు కాలేదని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

బడ్జెట్ కేటాయింపుల విషయంలో కూడా విమర్శలు వస్తున్నాయి. దేశ జనాభాలో భారీ శాతం ఉన్న ఓబీసీల సంక్షేమానికి కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయని బీసీ సంస్థలు ఆరోపిస్తున్నాయి. లక్షల కోట్ల రూపాయల యూనియన్ బడ్జెట్‌లో ఓబీసీ సంక్షేమానికి కేటాయింపులు చాలా పరిమితంగా ఉండటం సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు పెంచుతోంది.

సమస్య ఇక్కడే ఉంది. రాజకీయ వేదికలపై బీసీ ప్రతినిధిత్వం గురించి పెద్ద పెద్ద ప్రసంగాలు వినిపిస్తున్నాయి. కానీ బడ్జెట్‌లో, విధానాల్లో, సంస్థాగత నిర్మాణాల్లో అదే స్థాయి ప్రాధాన్యత కనిపించడం లేదనే విమర్శ బలపడుతోంది. బీసీ విద్యార్థుల హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి, చిన్న వ్యాపారాలకు రుణాలు, సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణ వంటి అంశాల్లో సమగ్ర దృష్టి కనిపించడం లేదని అనేక సామాజిక సంస్థలు చెబుతున్నాయి.ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలన్న డిమాండ్ కూడా వేగంగా ముందుకు వస్తోంది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు పార్లమెంట్ మరియు అసెంబ్లీల్లో రిజర్వేషన్లు ఉన్నాయి. కానీ ఓబీసీలకు అలాంటి రాజ్యాంగ రక్షణ లేదు. ఫలితంగా జనాభాలో భారీ శాతం ఉన్నప్పటికీ వారు రాజకీయ ప్రాతినిధ్యంలో అనేక ప్రాంతాల్లో వెనుకబడుతున్నారు.నిజమే, అనేక పార్టీలు బీసీ అభ్యర్థులకు టికెట్లు ఇస్తున్నాయి. కానీ అది పార్టీ చిత్తశుద్ధిపై ఆధారపడిన వ్యవస్థ. రాజ్యాంగబద్ధమైన హామీ కాదు. అందుకే జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన దిశలో అడుగులు వేయలేదు.ఈ చర్చ మధ్యలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు మరో కీలక అంశంగా మారుతున్నాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు పార్లమెంట్‌లో అనేక హామీలు ఇచ్చారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరురంగారెడ్డి జాతీయ ప్రాజెక్టు, గిరిజన విశ్వవిద్యాలయం, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు వంటి అనేక అంశాలు అప్పటి చర్చల్లో వచ్చాయి. కానీ చాలా హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలుకాలేదనే భావన తెలంగాణలో బలంగా ఉంది.ఈ అసంతృప్తి కేవలం ప్రాంతీయ భావోద్వేగం కాదు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా బీసీ వర్గాలు, అభివృద్ధి మరియు అవకాశాల పరంగా తమకు న్యాయం జరగలేదని భావిస్తున్నాయి. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం కేంద్రంపై అనుమానాలను పెంచుతోంది.ఇక్కడ ఒక పెద్ద రాజకీయ వైరుధ్యం కనిపిస్తోంది. ఒకవైపు కేంద్రం "డబుల్ ఇంజిన్ అభివృద్ధి" గురించి మాట్లాడుతోంది. మరోవైపు రాష్ట్రాల ప్రత్యేక డిమాండ్ల విషయంలో ఆలస్యం జరుగుతోందనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణలో బీసీ వర్గాలు ఈ ప్రశ్నలను కేవలం రాజకీయ కోణంలోనే కాదు, తమ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాలుగా చూస్తున్నాయి.

బీసీ రాజకీయాల పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే భారత రాజకీయ చరిత్రను కూడా చూడాలి. స్వాతంత్ర్యం తర్వాత చాలా కాలం వరకు బీసీలు రాజకీయంగా విభజించబడి ఉన్నారు. ప్రాంతాల వారీగా, కులాల వారీగా, వృత్తుల వారీగా విడిపోయి ఉండటంతో ఒక సమగ్ర రాజకీయ శక్తిగా ఎదగలేకపోయారు. కానీ మండల్ ఉద్యమం తర్వాత పరిస్థితులు మారాయి. ఉత్తర భారత రాష్ట్రాల్లో బీసీ ఆధారిత రాజకీయాలు ప్రభుత్వాలను ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగాయి.దక్షిణ భారతంలో అయితే సామాజిక న్యాయ ఉద్యమాలు మరింత పురాతనమైనవి. తమిళనాడులో పెరియార్ ఉద్యమం, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి దేవరాజ్ అస్ విధానాలు, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ సామాజిక ఉద్యమాలు బీసీ రాజకీయాలకు బలం చేకూర్చాయి. తెలంగాణలో ఇప్పుడు అదే చైతన్యం కొత్త రూపంలో వ్యక్తమవుతోంది.ఈ చైతన్యం వెనుక ఒక పెద్ద వాస్తవం ఉంది. భారత ఆర్థిక వ్యవస్థలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ వృత్తులు సంక్షోభంలో ఉన్నాయి. గ్రామీణ ఉపాధి తగ్గుతోంది. చిన్న వ్యాపారాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్య ఖరీదైపోతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు మరియు సంక్షేమ విధానాలు మరింత కీలకంగా మారుతున్నాయి.బీసీ యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ఇదీ ఒక కారణం. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం సామాజిక ఎదుగుదలకు ప్రధాన మార్గం. కానీ ఇప్పుడు ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. కాంట్రాక్ట్ విధానం పెరుగుతోంది. ప్రైవేటీకరణ విస్తరిస్తోంది. అలాంటప్పుడు రిజర్వేషన్ల ప్రయోజనం కూడా పరిమితమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, విద్యలో అధిక అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం వంటి అంశాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం తన పాలనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, జన్ ధన్ వంటి పథకాలు విస్తృత స్థాయిలో అమలయ్యాయి. వీటి ప్రయోజనం బీసీ వర్గాలకు కూడా చేరింది. కానీ బీసీ సంఘాల వాదన ఏమిటంటే సాధారణ పేదరిక నిర్మూలన పథకాలు మాత్రమే సరిపోవు. సామాజిక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొనే ప్రత్యేక విధానాలు అవసరం. ఉదాహరణకు ఒక గ్రామీణ బీసీ కుటుంబానికి గ్యాస్ కనెక్షన్ రావడం మంచిదే. కానీ అదే కుటుంబానికి ఉన్నత విద్యలో సీటు దొరకకపోతే, ఉద్యోగంలో ప్రాతినిధ్యం లేకపోతే, రాజకీయ నిర్ణయాల్లో స్థానం లేకపోతే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందా? అనే ప్రశ్న వస్తోంది.

అలాగే బీసీ వర్గాల్లో అంతర్గత అసమానతల అంశం కూడా కీలకం. కొన్ని బలమైన కులాలు అవకాశాలను ఎక్కువగా పొందుతున్నాయని, అత్యంత వెనుకబడిన కులాలు ఇంకా అంచుల్లోనే ఉన్నాయని విమర్శలు ఉన్నాయి. అందుకే ఉపవర్గీకరణ చర్చ కూడా ముందుకు వచ్చింది. కానీ ఈ అంశంలో కూడా స్పష్టమైన జాతీయ విధానం కనిపించడం లేదు.

తెలంగాణలో బీసీ రాజకీయ చర్చ ఇప్పుడు కేవలం రిజర్వేషన్లకే పరిమితం కావడం లేదు. ఆర్థిక వనరుల పంపిణీ, విద్యా సంస్థల ప్రాప్తి, డిజిటల్ అవకాశాలు, వ్యవసాయ సంక్షోభం, వృత్తిదారుల ఆధునికీకరణ వంటి విస్తృత అంశాలకు విస్తరిస్తోంది. సంప్రదాయ కులవృత్తులు మార్కెట్ పోటీలో నిలబడలేకపోతున్నాయి. చేతివృత్తులు సంక్షోభంలో ఉన్నాయి. చిన్న వ్యాపారాలు పెద్ద కార్పొరేట్ వ్యవస్థల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో బీసీ సంక్షేమం అంటే కేవలం రిజర్వేషన్లు కాదు. అది సమగ్ర ఆర్థిక పునర్నిర్మాణం. చిన్న పరిశ్రమలు, సహకార వ్యవస్థలు, తక్కువ వడ్డీ రుణాలు, మార్కెట్ మద్దతు, విద్యా ఆధునికీకరణ, డిజిటల్ శిక్షణ, స్థానిక వృత్తుల బ్రాండింగ్, ఇవన్నీ అవసరం.కానీ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా ఒక సమస్య. అనేక సంక్షేమ పథకాలు రాజకీయ పోటీ మధ్య చిక్కుకుపోతున్నాయి. కేంద్రం ఒకటి చెబితే రాష్ట్రం మరొకటి చెబుతోంది. చివరికి లబ్ధిదారుడు అయోమయంలో పడుతున్నాడు.

బీసీ రాజకీయాల మరో ముఖ్యాంశం ప్రతీకాత్మకత. దేశ రాజకీయాల్లో ఇప్పుడు గుర్తింపుల రాజకీయాలు బలంగా ఉన్నాయి. ఒక వర్గానికి చెందిన నాయకుడిని ముందుకు తెచ్చి ఆ వర్గ మద్దతు పొందడం సాధారణ వ్యూహంగా మారింది. కానీ ప్రతీకాత్మక ప్రాతినిధ్యం మరియు వాస్తవ సాధికారత మధ్య పెద్ద తేడా ఉంది.ఒక బీసీ నాయకుడు ప్రధానమంత్రి కావడం చారిత్రాత్మకమే కావచ్చు. కానీ అదే సమయంలో దేశవ్యాప్తంగా బీసీ వర్గాల పరిస్థితుల్లో గణనీయమైన మార్పు జరిగిందా? వారి విద్యా స్థాయి, ఉద్యోగ ప్రాతినిధ్యం, భూమి యాజమాన్యం, ఆదాయ స్థాయి, రాజకీయ శక్తి పెరిగిందా? అనే ప్రశ్నలకు గణాంకాలతో సమాధానం చెప్పాల్సి ఉంటుంది.ఇది కేవలం ఒక పార్టీ లేదా ఒక నాయకుడిపై విమర్శ కాదు. భారత ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం వాగ్దానాన్ని ఎంతవరకు నెరవేర్చిందనే పెద్ద ప్రశ్న. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగ నిర్మాతలు సమానత్వం కోసం రిజర్వేషన్లను తాత్కాలిక సాధనంగా ఊహించారు. కానీ సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయి. అంటే సమస్య నిర్మాణాత్మకంగా మరింత లోతుగా ఉందని అర్థం.

ప్రస్తుతం బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్నలన్నీ చివరికి ఒకే విషయాన్ని సూచిస్తున్నాయి, "మా జనాభాకు తగ్గ హక్కులు ఎక్కడ?" ఇది సంఖ్యల రాజకీయమా? అవును. కానీ అది కేవలం ఎన్నికల సంఖ్యల రాజకీయమే కాదు. అవకాశాల సంఖ్య, ఉద్యోగాల సంఖ్య, విద్యా సీట్ల సంఖ్య, బడ్జెట్ కేటాయింపుల సంఖ్య, రాజకీయ ప్రాతినిధ్య సంఖ్య గురించి కూడా. కులగణన కోసం పెరుగుతున్న డిమాండ్ కూడా ఇక్కడే అర్థమవుతుంది. డేటా లేకుండా విధానం ఉండదు. జనాభా గణాంకాలు లేకుండా న్యాయం సాధ్యం కాదు. ప్రపంచంలోని అనేక దేశాలు జాతి, వర్గ, ఆదాయ ఆధారిత డేటాను సేకరించి అసమానతలను అంచనా వేస్తున్నాయి. భారతదేశం మాత్రం కుల అసమానతలపై పూర్తి డేటా సేకరణలో ఇంకా వెనుకబడి ఉంది.

బీసీ మహిళల ప్రశ్న మరింత గంభీరమైనది. వారు కుల, లింగ, ఆర్థిక వెనుకబాటుతనాల మూడంచెల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మహిళా రిజర్వేషన్‌లో ఉపకోటా లేకపోతే రాజకీయాల్లో కూడా వారికీ తగిన ప్రాతినిధ్యం దక్కకపోవచ్చనే భయం ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది.అదేవిధంగా విద్యా వ్యవస్థలో కూడా బీసీ వర్గాలకు అనేక సవాళ్లు ఉన్నాయి. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, కోచింగ్ వ్యవస్థ ఖరీదు, ఇంగ్లీష్ మాధ్యమ ఆధిపత్యం, డిజిటల్ అసమానతలు, ఇవన్నీ సామాజికంగా వెనుకబడిన వర్గాలపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఉన్నత విద్యలో ప్రవేశం పెరిగినా, పూర్తిచేసే శాతం, ఉద్యోగ అవకాశాలు, పరిశోధన రంగ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో ఇంకా పెద్ద అంతరం ఉంది.

ఆర్థిక అసమానతలు కూడా పెరుగుతున్నాయి. భారతదేశంలో సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందనే చర్చలు తరచూ వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సామాజికంగా వెనుకబడిన వర్గాలు మరింత వెనుకపడే ప్రమాదం ఉంది. అందుకే సంక్షేమం మాత్రమే కాదు, ఆర్థిక పునర్విభజనపై కూడా చర్చ అవసరం.

బీసీ వర్గాల రాజకీయ చైతన్యం పెరగడం భారత ప్రజాస్వామ్యానికి ఒక సానుకూల పరిణామంగా కూడా చూడాలి. ఎందుకంటే అది మరింత సమానత్వం కోసం ఒత్తిడి తీసుకువస్తోంది. అయితే అదే సమయంలో ఈ చర్చలు సామాజిక విభజనలకు దారితీయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం కూడా ఉంది. సామాజిక న్యాయం అంటే ఒక వర్గంపై ద్వేషం కాదు, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం.కేంద్ర ప్రభుత్వం ఈ ప్రశ్నలకు రాజకీయ రీతిలో మాత్రమే కాకుండా విధాన పరంగా సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కులగణనపై స్పష్టమైన టైమ్‌లైన్, బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన విధానం, మహిళా రిజర్వేషన్‌లో ఉపకోటా అంశంపై చర్చ, ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖపై నిర్ణయం, బడ్జెట్ కేటాయింపుల పెంపు, తెలంగాణ విభజన హామీల అమలు వంటి అంశాల్లో స్పష్టత అవసరం.ఇక రాష్ట్ర ప్రభుత్వాలకూ బాధ్యత ఉంది. బీసీ రాజకీయాలను కేవలం ఎన్నికల నినాదాలుగా కాకుండా దీర్ఘకాలిక సామాజిక మార్పు కార్యక్రమాలుగా చూడాలి. విద్య, ఆరోగ్యం, ఉపాధి, వృత్తి ఆధునికీకరణ, మహిళా సాధికారత, డిజిటల్ ప్రాప్తి, ఇవన్నీ సమగ్ర దృష్టితో ముందుకు తీసుకెళ్లాలి. తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న బీసీ చైతన్యం దేశ రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. ఎందుకంటే ఇది కేవలం ఒక రాష్ట్ర సమస్య కాదు. ఉత్తరప్రదేశ్ నుంచి తమిళనాడు వరకు, బీహార్ నుంచి కర్ణాటక వరకు ఓబీసీ రాజకీయాలు భారత ఎన్నికల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి.ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఏమిటంటే భారత ప్రజాస్వామ్యం సంఖ్యల ఆధారంగా నిజమైన ప్రాతినిధ్యాన్ని అందించగలదా? లేక ప్రతీకాత్మక రాజకీయాలతోనే కొనసాగుతుందా? బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్నలు ఈ చర్చను మరింత లోతుగా తీసుకెళ్తున్నాయి.


నరేంద్ర మోడీపై వ్యక్తిగతంగా ఉన్న ప్రజాదరణ, రాజకీయ నైపుణ్యం, ఎన్నికల విజయాలు ఎంత ఉన్నా, సామాజిక న్యాయం ప్రశ్నల నుంచి ఎవరూ తప్పించుకోలేరు. ముఖ్యంగా తాను ఓబీసీ నేపథ్యం నుంచి వచ్చిన నాయకుడిగా చెప్పుకునే సందర్భంలో ఈ ప్రశ్నలకు మరింత బలమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.ఇది ఒక రాజకీయ దాడి మాత్రమే కాదు. ఇది భారత రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ వాగ్దానాన్ని గుర్తుచేసే సామాజిక ప్రశ్న. బీసీ వర్గాలు ఇప్పుడు కేవలం సంక్షేమ పథకాలు కాదు, పాలనా నిర్మాణాల్లో భాగస్వామ్యం కోరుతున్నాయి. కేవలం ఎన్నికల సమయంలో గుర్తింపు కాదు, విధాన నిర్ణయాల్లో స్థానం కోరుతున్నాయి. కేవలం హామీలు కాదు, అమలు కోరుతున్నాయి.తెలంగాణ నుంచి వినిపిస్తున్న ఈ స్వరం దేశవ్యాప్తంగా మారుమోగే అవకాశముంది. ఎందుకంటే భారతదేశ భవిష్యత్తు గురించి జరుగుతున్న పెద్ద చర్చల్లో సామాజిక న్యాయం ప్రశ్నను ఇకపై పక్కన పెట్టడం సాధ్యం కాదు.

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు హక్కు కాదు. అది సమాన అవకాశాలు, సమాన గౌరవం, సమాన ప్రాతినిధ్యం. బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్నలన్నీ చివరికి అదే సూత్రాన్ని గుర్తు చేస్తున్నాయి.

ఈ ప్రశ్నలకు సమాధానాలు కేవలం ఎన్నికల సభల్లో వచ్చే ప్రసంగాల్లో ఉండవు. అవి చట్టాల్లో ఉండాలి. బడ్జెట్‌లలో ఉండాలి. విధానాల్లో ఉండాలి. సంస్థల్లో ఉండాలి. అమల్లో కనిపించాలి.

అప్పుడే "సబ్కా వికాస్" అనే నినాదం నిజమైన అర్థం పొందుతుంది. అప్పుడే ఒక బీసీ నాయకుడు అధికారంలో ఉండటం సామాజిక న్యాయ చరిత్రలో నిజమైన మలుపుగా నిలుస్తుంది. లేకపోతే అది కేవలం రాజకీయ ప్రతీకగా మాత్రమే మిగిలిపోతుంది.

ఇప్పుడు నిర్ణయం అధికారంలో ఉన్నవారి చేతుల్లో ఉంది. బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్నలను వినిపించని శబ్దాలుగా తీసుకుంటారా? లేక భారత ప్రజాస్వామ్యాన్ని మరింత సమానత్వ దిశగా తీసుకెళ్లే అవకాశంగా చూస్తారా? అన్నది రాబోయే కాలం నిర్ణయిస్తుంది.కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. బీసీ సమాజం ఇక మౌనంగా ఉండే దశ దాటిపోయింది. తమ సంఖ్య, తమ హక్కులు, తమ ప్రాతినిధ్యం, తమ గౌరవం గురించి స్పష్టంగా మాట్లాడే దశలోకి వచ్చింది. భారత రాజకీయాలు కూడా ఈ కొత్త వాస్తవాన్ని అర్థం చేసుకోవాల్సిందే.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా కుస్తీ పోటీలు

- **హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు హార్కర వేణుగోపాల్ రావు**
- **యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు అవసరం**

వెలుతురు, హైదరాబాద్ మే 10:



హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన కుస్తీ పోటీలు ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమానికి గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు హార్కర వేణుగోపాల్ రావుతో కలిసి పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్న నేతలు క్రీడాకారులను ప్రోత్సహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన మల్లయోధులు తమ ప్రతిభను ప్రదర్శించగా, పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కుస్తీ వంటి సంప్రదాయ క్రీడలు యువతలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అతిథులు పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లాలని నాయకులు సూచించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు అభినందనలు తెలియజేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగణన ఫారంలో బీసీ కుల గణన చేర్చాలి

- **ప్రధాని మోదీకి భట్టి విక్రమార్క బృందం వినతిపత్రం**
- **జనగణనలో బీసీ కులాల వివరాలు నమోదు చేయాలని విజ్ఞప్తి**
- **హౌస్‌హోల్డర్ షెడ్యూల్‌లోని కాలమ్-13లో బీసీ కుల గణన ప్రస్తావన లేదని ఆందోళన**

హైదరాబాద్ వెలుతురు మే 10:



దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణన ప్రక్రియలో బీసీ కుల గణనకు ప్రత్యేక స్థానం కల్పించాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జనగణనలో ఉపయోగిస్తున్న హౌస్‌హోల్డర్ షెడ్యూల్‌లోని కాలమ్ 13లో బీసీ కులాల వివరాలను నమోదు చేసే అవకాశం లేకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీకి వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అజహారుద్దీన్, ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను అంచనా వేయాలంటే జనగణనలో కులాల వారీగా డేటా సేకరణ అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు. బీసీల అసలు జనాభా వివరాలు అందుబాటులో లేకపోవడం వల్ల సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్ల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల్లో అసమానతలు ఏర్పడుతున్నాయని నేతలు పేర్కొన్నారు. అందువల్ల జనగణనలో ప్రత్యేకంగా బీసీ కుల గణన నిర్వహిస్తేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని వారు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, అదే నమూనాను కేంద్రం కూడా అనుసరించాలని కోరారు. జనగణనలో బీసీ కులాల వివరాలను నమోదు చేయడం ద్వారా దేశంలో వెనుకబడిన వర్గాల అసలు పరిస్థితి బయటపడుతుందని, తద్వారా రాజ్యాంగబద్ధ హక్కులు సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే హౌస్‌హోల్డర్ షెడ్యూల్‌లో మార్పులు చేసి బీసీ కుల గణనకు ప్రత్యేక కాలమ్ చేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు.

# తిరుచ్చి ఈస్ట్‌కు విజయ్ రాజీనామా..

- **పెరంబూర్‌కే విజయ్ మొగ్గు..**
- **రెండు స్థానాల్లో గెలిచిన టీవీకే చీఫ్ విజయ్**
- **పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగనున్న తమిళనాడు సీఎం**
- **తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్న విజయ్**
- **రాష్ట్ర అసెంబ్లీ సెక్రటేరియట్ అధికారిక ప్రకటన**
- **జయలలిత తర్వాత రెండు చోట్ల పోటీ చేసిన నేతగా గుర్తింపు**
- **ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక సీటుకు రాజీనామా**
- **నేటి నుంచి తమిళనాడు అసెంబ్లీ తొలి సమావేశాలు**
- **కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం**
- **మే 12న స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక**
- **తమిళ రాజకీయాల్లో విజయ్ అడుగులు ఆసక్తికరం**

చెన్నై వెలుతురు మే 10:



టీవీకే చీఫ్, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన ఆయన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. అయితే తాజా నిర్ణయం ప్రకారం తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకుని పెరంబూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీ సెక్రటేరియట్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. అయితే రెండు చోట్ల గెలిస్తే ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధన మేరకే విజయ్ తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో అక్కడ త్వరలో ఉపఎన్నిక నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమిళనాడులో అన్నాడీఎంకే మాజీ అధినేత్రి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత తర్వాత ఏకకాలంలో రెండు స్థానాల నుంచి పోటీ చేసిన ప్రముఖ నేతగా విజయ్ గుర్తింపు పొందారు. తొలి ఎన్నికల పోటీలోనే రెండు చోట్ల విజయం సాధించడం ఆయన రాజకీయ ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ తొలి సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ తొలిసారి సమావేశం కానుంది. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులంతా తమ ఎన్నికల ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని అసెంబ్లీ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. కె. శ్రీనివాసన్ ప్రకటన విడుదల చేశారు. అలాగే మే 12న ఉదయం 9.30 గంటలకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తమిళ రాజకీయాల్లో సినీ రంగం నుంచి వచ్చిన విజయ్ వేగంగా ఎదుగుతుండటం, తొలి ఎన్నికలకే ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు రెండు స్థానాల్లో ఒకదాన్ని ఎంపిక చేసుకోవడంతో ఆయన తదుపరి రాజకీయ వ్యూహాలపై ఆసక్తి నెలకొంది.

# టీఎంసీలో తిరుగుబాటు..

- **మమత, అభిషేక్‌పై సొంత పార్టీ నేతల సంచలన ఆరోపణలు**
- **టీఎంసీలో బహిర్గతమవుతున్న అంతర్గత విభేదాలు**

పశ్చిమబెంగాల్ వెలుతురు మే 10:



పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఓటమి చవిచూసిన అనంతరం ఆ పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం నెలకొంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నాయకత్వంపై సొంత పార్టీ నేతలే బహిరంగంగా విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లు పార్టీ అంతర్గతంగా మాత్రమే ఉన్న అసంతృప్తి ఇప్పుడు బహిరంగ స్థాయికి చేరుకోవడం గమనార్హం. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రవర్తించారనే కారణంతో రిజు దత్తా, కోహినూర్ మజుందార్, కార్తీక్ ఘోష్‌లను టీఎంసీ ఆరేళ్ల పాటు సస్పెండ్ చేసింది. అయితే ఈ చర్యలతో అసంతృప్తి మరింత పెరిగినట్లు కనిపిస్తోంది. సస్పెన్షన్‌కు గురైన నేతలు పార్టీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేయడం ప్రారంభించారు. టీఎంసీ ప్రతినిధి రిజు దత్తా చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. గతంలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి పై తాను చేసిన విమర్శలు పార్టీ ఒత్తిడి, బెదిరింపుల కారణంగానే చేశానని వెల్లడించారు. ఎక్స్ వేదికగా సువేందు అధికారికి బహిరంగ క్షమాపణలు కూడా చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో తనకు మద్దతుగా నిలిచిన భాజపాను కొనియాడారు. దీంతో బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.

ఇక మాజీ క్రికెటర్, మాజీ మంత్రి మనోజ్ తివారి కూడా టీఎంసీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేశారని ఆరోపించారు. సీనియర్ మంత్రి అరూప్ బిస్వాస్ కు క్రీడలపై సరైన అవగాహన లేదని విమర్శించారు. టీఎంసీకి చెందిన మరో నేత కోహినూర్ మజుందార్ కూడా అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను కలవాలంటే పార్టీ నేతలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేదని ఆరోపించారు. సీనియర్ నేతలకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదని మరికొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఓటమి తర్వాత టీఎంసీలో అసంతృప్తి స్వరాలు పెరుగుతుండటం, సొంత నేతలే పార్టీపై ఆరోపణలు చేయడం వల్ల బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బంగారం కొనొద్దు.. స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేయండి

- **అప్పుడే దేశ ఆర్థిక బలం పెరుగుతుందన్న ప్రధాని**
- **యుద్ధాల ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి**

హైదరాబాద్ వెలుతురు మే 10:



కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో తీవ్ర సమస్యలు తలెత్తాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. యుద్ధాల ప్రభావంతో అనేక దేశాల్లో చమురు ధరలు భారీగా పెరిగాయని, అయినప్పటికీ ఆ భారం దేశ ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో పెట్రోల్, డీజిల్ సమస్యలను వివిధ దేశాలతో చర్చలు జరిపి అధిగమించే ప్రయత్నం చేస్తున్నామని మోదీ చెప్పారు. అయితే దీర్ఘకాలంలో చమురు వినియోగాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, రైల్వే రంగంలో డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ అవసరం భారీగా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చమురు వినియోగం తగ్గితే విదేశీ మారక ద్రవ్యం దేశంలోనే మిగులుతుందని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్న ప్రధాని.. ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలని పిలుపునిచ్చారు. పండుగలు, శుభకార్యాల సందర్భాల్లో బంగారం కొనుగోళ్లు తగ్గించాలని సూచించారు. బంగారం దిగుమతులు తగ్గితే విదేశీ మారక ద్రవ్యం పెరుగుతుందని చెప్పారు. అలాగే విదేశీ పర్యటనలు, డెస్టినేషన్ మ్యారేజ్‌లను కూడా తగ్గించుకోవాలని ప్రజలకు సూచించారు. వంటనూనె విషయంలో కూడా భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోందని పేర్కొన్న మోదీ.. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా దేశాల్లో యూరియా బస్తా ధర రూ.3 వేల వరకు ఉంటే, భారత్‌లో మాత్రం రూ.300లోపే అందిస్తున్నామని గుర్తు చేశారు. ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని పెంచాలని రైతులకు సూచించారు. అన్నింటికీ దిగుమతులపైనే ఆధారపడితే దేశాభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేసిన ప్రధాని.. నిత్యావసర వస్తువుల్లో స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. "స్వదేశీ కేవలం బీజేపీ నినాదం కాదు.. ఇది దేశ విధానం" అని మోదీ పేర్కొన్నారు.

# తెలంగాణను దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం





హైదరాబాద్ వెలుతురు మే 10:

హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధాని మోడీ, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం వాటా అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రగతికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్‌మచిలీపట్నం 12 వరుసల జాతీయ రహదారి, మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు కేంద్రం సత్వర అనుమతులు మంజూరు చేయాలని ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు పట్టుకొమ్మలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వరంగల్‌లో పీఎం మిత్ర పార్క్ ప్రారంభోత్సవం జరగడం, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, జాతీయ రహదారి 167 విస్తరణ పనులకు శంకుస్థాపన జరగడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# ప్రధాని మోదీ ఆప్యాయతను జీవితాంతం గుర్తుంచుకుంటా

- **సోషల్ మీడియాలో ఎమోషనల్ అయిన పవన్ కళ్యాణ్**

**హైదరాబాద్, మే 10 (వెలుతురు):** హైదరాబాద్ లోని తన నివాసానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రావడం జీవితంలో మరచిపోలేని అనుభూతిగా నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో భావోద్వేగపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. తన సతీమణి అన్నా కొణిదలతో పాటు పిల్లలు అకీర నందన్, ఆద్య, పోలినా అంజని, మార్క్ శంకర్‌లతో కలిసి ప్రధాని మోదీకి స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పవన్ కళ్యాణ్ తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితి గురించి వ్యక్తిగతంగా తెలుసుకోవడానికి ప్రధాని స్వయంగా రావడం ఆయనలోని మానవత్వం, ఆప్యాయతను ప్రతిబింబిస్తోందన్నారు. ఏప్రిల్ 19న శస్త్రచికిత్స అనంతరం కూడా ప్రధాని మోదీ స్వయంగా ఫోన్ చేసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారని గుర్తుచేశారు. ప్రస్తుతం కోలుకుంటున్న సమయంలో ఇంటికి వచ్చి పరామర్శించడం జీవితాంతం గుర్తుండిపోయే సంఘటనగా అభివర్ణించారు. దేశానికి నాయకత్వం వహిస్తున్నప్పటికీ ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యుల్లా చూసే వ్యక్తిత్వం ప్రధాని మోదీదని పవన్ కళ్యాణ్ కొనియాడారు. ప్రజల సంక్షేమమే ఆయన ఆలోచనల కేంద్రబిందువని, ఆయన వినయం, కరుణ, ప్రజలతో ఉన్న భావోద్వేగ అనుబంధం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తోందన్నారు. తనకు చూపిన ఆదరణ, ఆప్యాయత, మార్గదర్శకత్వానికి ప్రధాని మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.



# విశాఖ అంటే ఇప్పుడు గూగుల్, టీసీఎస్

- **గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి**
- **వైకాపా అంటే గొడ్డలి, గంజాయి,**
- **పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్న మంత్రి**

మంగళగిరి వెలుతురు మే 10:



కూటమి ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయికి చేరుతోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇప్పుడు విశాఖ అంటే గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచస్థాయి సంస్థలు గుర్తొస్తున్నాయని, పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంచేలా ప్రభుత్వం పాలన సాగుతోందని చెప్పారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ పేరు గంజాయి, మాదకద్రవ్యాల కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని సంధ్యారాణి విమర్శించారు. అభివృద్ధి కంటే అరాచకాలు, భూకబ్జాలకు మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాల కోసమే గత ప్రభుత్వం పనిచేసిందని దుయ్యబట్టారు. ప్రస్తుతం అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ సాగు పెరుగుతోందని మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను పెంచుతూ రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని త్వరలో జాతికి అంకితం చేయనున్నట్లు సంధ్యారాణి వెల్లడించారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలక ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించడం ద్వారా తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించనున్నామని తెలిపారు.

# పరేడ్ గ్రౌండ్ లో బండి సంజయ్ మేనియా













- బండి సంజయ్ వేదికపైకి రాగానే దద్దరిల్లిన పరేడ్ గ్రౌండ్
- జై శ్రీరాం నినాదాలతో మారుమోగిన పరేడ్ గ్రౌండ్
- సంజయ్ ప్రసంగానికి కార్యకర్తలు ఫిదా
- జై శ్రీరాం...జై తెలంగాణ.... నినాదాలతో కాంగ్రెసోళ్ల చెవుల్లో రక్తం కారాలే
- జై శ్రీరాం అంటే డబ్బులే కాదు.... కాంగ్రెస్, బీఆర్ఎస్ గుండెల్లో రాళ్లు కూడా పడుతున్నయ్
- జై శ్రీరాం నినాదాలతో బెంగాల్ లో అరాచకాలు పోయాయి....
- జై శ్రీరాం నినాదంతోనే బెంగాల్ లో అధికారంలోకి వచ్చింది
- బెంగాల్ తరువాత మన నెక్స్ట టార్గెట్ తెలంగాణే
- బెంగాల్ గెలుపుతో ఆ పార్టీల నేతల్లో వణుకు మొదలైంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పునాదులు కదులుతున్నయ్
- ఢిల్లీ నుండి మోదీ నిధులు తెస్తుంటే... కాంగ్రెసోళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపుతున్నరు
- హిందీ మాట్లాడే మోదీ నిధుల వరద పారిస్తుంటే....తెలుగు మాట్లాడే రేవంత్ రెడ్డి నిధులు ఢిల్లీకి దొచిపెడుతున్నారు
- మోదీ 12 లక్షల కోట్లు ఇస్తే.... రేవంత్ రెడ్డి తెలంగాణకు చిప్ప చేతికిచ్చిండు
- బీజేపీ కార్యకర్తల పోరాటాలవల్లే గడీలు బద్దలయ్యాయి
- బీజేపీ కార్యకర్తల బలిదానాలను, త్యాగాలను వృధాగా పోనివ్వం
- దేశం, ధర్మం కోసం ఎందాకైనా కొట్లాడాలనే ఆర్ఎస్ఎస్ ఉగ్గుపాలతో పెరిగినోళ్లం
- మీ తాటాకు చప్పళ్లకు బెదిరే ప్రసక్తే లేదు
- భయపెడితే భయపడటానికి నేను ఫామ్ హౌస్ లో ఎలుకను అనుకుంటున్నరా?
- అయ్య ఆస్తి మీద.. అయ్య పేరు మీద ఎదిగిన నాయకుణ్ణి కాదు
- బీజేపీ సైనికులం...మోదీ శిష్యులం
- ప్రాణం పోయినా తప్పు చేయం
- తప్పు చేసే వాళ్లను కూడా వదిలిపెట్టబోం
- బీజేపీ తలదించుకునే పని నేను అసలే చెయ్యం
- అవినీతి, అక్రమాలు, అరాచకాలు చేస్తూ తెలంగాణను ముంచినోళ్లే ఎదురుదాడి చేస్తుంటే... ఏ తప్పు చేయనోళ్లం ఊకుంటమా?
- అగ్గి పుట్టిద్దాం...ఆ అగ్గిలో అవినీతి, కుటుంబ పార్టీలను కాల్చి బూడిద చేద్దాం...
- మీరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా "నాయల్దీ తగ్గేది లే"
- బరబార్ బరిగీసి నిలబడతా... కలబడతాం
- మోదీగారి నాయకత్వంలో నితిన్ నబిన్ గారి ఆధ్వర్యంలో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చి తీరుతాం

హైదరాబాద్ వెలుతురు మే 10:

పరేడ్ గ్రౌండ్ లో ఇద్దరు నేతలు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. ఒకరు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాగా.. ఇంకొకరు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ కు రాకకు 45 నిమిషాల ముందే బండి సంజయ్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేశారు. అప్పటికే పరేడ్ మైదానమంతా పూర్తిగా జన సంద్రమైంది. వేదికపై మహామహులంతా ఉన్నారు. బండి సంజయ్ సభా వేదికపై రాగానే ఒక్కసారిగా సభలోని వేలాది మంది కార్యకర్తల్లో ఒక్కసారిగా జోష్ నెలకొంది. ఈలలు, కేరింతలు, చప్పట్లతో విజిల్స్ వేస్తూ జై మోదీ.. జై బండి అంటూ నినదాలు చేయడంలో పరేడ్ మైదానమంతా మారుమోగిపోయింది. ఇక బండి సంజయ్ ప్రసంగం సైతం కార్యకర్తలను ఆకట్టుకుంది. జై శ్రీరాం నినాదంవల్ల తెలంగాణకు డబ్బులు రావడమే కాదు, కాంగ్రెస్, బీఆర్ఎస్ గుండెల్లో రాళ్లు పడుతున్నాయంటూ చేసిన వ్యాఖ్యలతో పరేడ్ మైదానం మరోసారి దద్దరిల్లింది. నేను ఏనాడు బీజేపీకి తలవంపులు తేను... మీ తాటాకు చప్పళ్లకు భయపడేటోడిని కాదు. భయపెడితే భయపడటానికి మీ ఫాంహౌజ్ లో ఎలుకను కాదు.. అయ్యపేరు చెప్పి, ఆస్తులకు కూడగట్టుకునేటోడిని కాదు. ధర్మం కోసం పనిచేసే కాషాయ కార్యకర్తను. కాషాయ జెండా మోస్తున్న మోదీ సైనికుడిని.''అంటూ చేసిన ప్రసంగంతో పరేడ్ మైదానమంతా పులకించిపోయింది.

---

## "ఆదునిక గ్రంథం పెద్దల బాల శిక్ష"




ఆధునిక వాస్తవ పెద్దల బాలశిక్షను పటిష్టంగా చదవండి!...
ప్రాపంచిక విధానాలా విశ్వం కనబడుతుంది!..
నేటి సామాజిక అంశాలకు...
తగ్గట్టుగా అక్షరాలు నేర్వండి!..
వాస్తవ జనారణ్యంలో తిరగండి..
పాతాలు గుణపాతాలు తెలుస్తాయి,!..
ఒకొక్కరిని పలుకరించండి...
ఉన్న ఘర్షణలు సంఘర్షణలు...
బయట పడుతాయి!..
వారి మూలాలను చుట్టేయండి
బాధలు విబేధాలు వినడబడతై
మనసును తట్టండి...
వ్యధలు వదలు కనబడతాయి...
చేయి చేయి కలపండి ...
ఉన్న కక్షలు శిక్షలు వినబడతాయి!...
పొగలా అల్లుకున్న తెగలేంటో...
బిగుసుకున్న ఉచ్చులేంటో ...
అన్నిటికి ముందుకు నడుస్తున్న తెగువలేంటో...
ఆధునిక కాలంలో మస్తకానికి
మత్తుమందు సెల్ మాటల విందు...
పేజీలు తిప్పినకొద్దీ కొత్త అద్దకాలే
తరచి చూడండి దురదృష్టంతో కొందరు
దుర్భిక్షంలో మరికొందరు
మెతుకును ఇచ్చే రైతన్న వలస వెళ్ళాడు!..
బతుకునిచ్చేకూలెన్న బజారులో పడ్డాడు,,!..
కొందరు కడుపునిండా కుళ్ళు ముళ్ళు!..
పెట్టుకొని అంతటా తిరుగు చున్నారు...
అందరిలో లేనిపోని పొగల సెగలు పెడుతారు!..
ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకొని నేతలు...
ఇది నడుస్తున వ్యవస్థలోని అవస్థలపెద్దల బాల శిక్ష!..
అందరూ చదవండి అని విషయాలు తెలుస్తాయి
అంతానేనే అనే సైకాలజీ తత్వం
అంతానాకే తెలుసు అనే మిడిసి పాటు...
వచ్చే ప్రమాదం గుర్తించలేని గుడ్డితనం!...
పుట్టుకొచ్చే పులకింతలెన్నో..
పురివిప్పిన ప్రమాదాలు లెన్నో
పసికట్టలేని పరుగులెన్నో!...
క్షణంక్షణం ఏదో కొత్త దనమే...
ప్రతి క్షణం ఏదో పొందాలనే తపననే ...
ఆశనిండుకుంది దురాశ దూకుతుంది!..
కొందరు అనైతిక సందేహాలతో
అంతమవుచున్నారు
మరికొందరు ఎత్తిపొడుపుల...
కత్తిపోట్లకు బలవుచున్నారు...
ఇంకా ఎందరెందరో పెను విపత్తులో ఉన్నారు!..
ఒకొక్క పేజీలో ఒకొక్క విలయాల వలయం
మహా ప్రళయాల పరువాలు ఇమిడి ఉన్నాయి!..
తరచి చూడండి త్రవ్వి తీయండి..
పెద్దల బుద్దులు పేదోల్ల బతుకులను!..

**అంబటి నారాయణ**
**నిర్మల్**
**9849326801**

## ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి

- బెంగళూరులో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యమే కీలకమని వెల్లడి.
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ సేవలపై ప్రశంసలు

బెంగళూరు వెలుతురు మే 10:

ప్రభుత్వాలు, రాజకీయాల కంటే సమాజమే అత్యంత శక్తివంతమని, సమాజ శక్తి మేల్కొన్నప్పుడే దేశం ప్రగతి పథంలో దూసుకుపోతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరులో జరిగిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్థాపించిన ధ్యాన్ మందిర్‌ను ప్రారంభించిన అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. భారతదేశ ఆధ్యాత్మిక విలువలు నేడు ప్రపంచవ్యాప్తంగా వెలుగులు విరజిమ్ముతున్నాయని, 45 ఏళ్ల క్రితం శ్రీశ్రీ రవిశంకర్ నాటిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనే చిన్న విత్తనం నేడు మహా వటవృక్షంగా ఎదిగి కోట్లాది మందికి మానసిక ప్రశాంతతను అందిస్తోందని కొనియాడారు. ఏ ఉద్యమమైనా ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విజయవంతమవుతుందని, దేశ నిర్మాణంలో ప్రజలు చురుకుగా పాల్గొన్నప్పుడే ఏ ప్రభుత్వమైనా తన లక్ష్యాలను చేరుకోగలదని మోదీ ఉద్ఘాటించారు. భారతదేశం విభిన్నతకు నిలయమని, ఎన్నో భాషలు, సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నప్పటికీ మనందరినీ కలిపి ఉంచేది సేవాభావమేనని ప్రధాని మోదీ అన్నారు. "తన కోసం కాదు ఇతరుల కోసం జీవించడం" అనే సూత్రమే భారతీయ సంస్కృతికి మూలమని చెప్పారు. సంకల్పం స్పష్టంగా ఉండి, నిస్వార్థంగా పని చేస్తే అద్భుత ఫలితాలు వస్తాయని ఆయన వివరించారు. సభ జరిగిన ప్రాంతంలోని పద్మాకారపు పైకప్పును చూపిస్తూ ప్రధాని సరదాగా స్పందించారు. "మనమంతా ఇప్పుడు కమలం నీడలోనే ఉన్నాం. గురుదేవుల ఆశీస్సులతో ఈ కమలం దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలు మాత్రమే కాదని, అది సమాజానికి సేవ చేసే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. డిజిటల్ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాలు మాత్రమే సాంకేతికతను వాడగలవనే అపోహ ఉండేదని, కానీ నేడు భారత్ డిజిటల్ పేమెంట్స్‌లో ప్రపంచానికే పాఠాలు చెబుతోందని అన్నారు. స్టార్టప్ వ్యవస్థలో భారత్ అగ్రస్థానంలో ఉందని, అంతరిక్ష రంగంలో మన యువత అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. సాంకేతికత ద్వారా ప్రపంచంతో అనుసంధానం కావడం ఎంత ముఖ్యమో, యోగా మరియు ధ్యానం ద్వారా మనతో మనం అనుసంధానం కావడం కూడా అంతే అవసరమని చెప్పారు. మానసిక ప్రశాంతత కలిగిన యువత మాత్రమే 'వికసిత్ భారత్' కలలను నిజం చేయగలరని, అందుకే యోగాను ప్రతి ఒక్కరూ జీవనశైలిగా మార్చుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రధాని స్పందిస్తూ, "ఎకాలజీ మరియు ఎకానమీ"ని వేరు చేసి చూడలేమని అన్నారు. ప్రకృతిని కాపాడుకుంటేనే సంపద పెరుగుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వల్ల భూమాత అనారోగ్యం పాలవుతోందని, దీనికి ప్రకృతి వ్యవసాయమే సరైన చికిత్స అని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరుతో ఒక చెట్టు) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక బాధ్యత కాదని, అది మన మనుగడకు ప్రాథమిక అవసరమని ఆయన గుర్తు చేశారు. రాజకీయ అంశాలపై మాట్లాడుతూ.. కర్ణాటకలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వంలో ఉన్న వారి మధ్య ఉన్న అంతర్గత పోరు వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి ఎవరికి ఉండాలి, ఎవరిని మార్చాలి అనే దానిపైనే వారు సమయం వృథా చేస్తున్నారని, అభివృద్ధిని గాలికొదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తన స్వార్థం కోసమే పనిచేస్తుందని, గతంలో తమిళనాడులో డీఎంకేను వాడుకుని ఆ తర్వాత వెన్నుపోటు పొడిచిందని ఉదాహరణలతో వివరించారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కూడా సొంత పార్టీ నేతలకే వాగ్దానాలు చేసి మోసం చేశారని, ఇప్పుడు కర్ణాటక, కేరళ వంతు వచ్చిందని ఎద్దేవా చేశారు. మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. పార్లమెంటులో 'నారీ శక్తి వందన్' చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా ఆ పార్టీ తన నైజాన్ని చాటుకుందని అన్నారు. ఒకవేళ ఆ చట్టం అమలైతే కర్ణాటక నుంచి మరింత మంది మహిళలు అసెంబ్లీకి, పార్లమెంటుకు వెళ్లేవారని, కానీ కాంగ్రెస్ మహిళల ఎదుగుదలను అడ్డుకుందని విమర్శించారు. ఈ పాపానికి కర్ణాటక మహిళలు కాంగ్రెస్‌ను ఎన్నటికీ క్షమించరని అన్నారు. బీజేపీకి కర్ణాటక ఎప్పుడూ బలమైన పునాదిగా ఉంటుందని, బెంగాల్, కేరళలో మాదిరిగానే కర్ణాటకలో కూడా బీజేపీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టమే పార్టీకి అసలైన బలమని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. చివరగా, భారతదేశం కేవలం శాస్త్రీయ ఆవిష్కరణల్లోనే కాకుండా, ఆధ్యాత్మిక మరియు మానవతా విలువల్లోనూ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోందని మోదీ అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు సమాజంలోని చీకట్లను తొలగించి జ్ఞాన దీపాలను వెలిగిస్తున్నాయని ప్రశంసించారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ రవిశంకర్, ఇతర ప్రముఖులు మరియు భారీ సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com